RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 31 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి సోమవారం 09-03-2026 పేజీలు :8 వెల : రూ.1-00

# ప్రపంచ దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర

- ఎక్కడికి వెళ్లినా భారతీయ నిపుణులు కనిపిస్తారు - గ్రీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధితో పాటు, ఎగుమతికి అవకాశం
- త్వరలో రివర్స్ మైగ్రేషన్ కూడా సాధ్యమే - సంతానోత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది
- ఢిల్లీ సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు




**న్యూఢిల్లీ, మార్చి 08 :** నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వచ్చే రోజులు వచ్చాయని, త్వరలోనే 'రివర్స్ మైగ్రేషన్' ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోస్యం చెప్పారు.గతంలో మన నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు వెళ్లడం 'మేధో వలస'గా భావించేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రపంచ గమనంలో భారతీయుల పాత్ర, నాలెడ్జ్ ఎకానమీలో దేశం సాధించబోతున్న ప్రగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ-అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్,

తరువాయి 2లో..



# బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం..

## రాష్ట్రపతి అసహనం



**పశ్చిమ బెంగాల్, మార్చి 08 :** పశ్చిమ బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంత ర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఆదివాసీ సదస్సుకు అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. అయినప్పటికీ మమత ప్రభుత్వంపై ఎటు వంటి ద్వేషం లేదని..ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. 9వ అంత ర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగుడికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వంలోని సీనియర్ అధి కారులు గానీ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే అధికారి కంగా స్వాగతించడానికి ప్రభు త్వం తరఫున ఎవరూ రాక పోవడం గమనార్హం.

# మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

## - మంత్రి సత్యకుమార్




**అమరావతి, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం మంతా ఆరోగ్యంగా ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభాలో సగం వరకు ఉన్న మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలం బనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్య సంర క్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆరోగ్య సంరక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలకు ప్రభుత్వాసుపత్రుల ద్వారా ఉచితంగా ఉన్నత వైద్యాన్ని చేరువచేసే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ఆశా కార్యకర్తల నుంచి రకరకాల హోదాల్లో కలిపి సుమారు 70వేల మంది మహిళలు పని చేస్తు న్నారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వైద్య సేవలు ఆశాల ద్వారానే ప్రారంభ మవు తున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వాసు పత్రుల్లో ప్రసవించిన మహిళలకు 'బేబి కిట్టు' పథకాన్ని త్వరలో అమలుచేస్తామని తెలిపారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం

తరువాయి 2లో..

# బెంగాల్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

## ప్రధాని నరేంద్ర మోదీ



**ఢిల్లీ, మార్చి 08 :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. టీఎంసీపై మండిపడ్డారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వెళ్తే సత్కరించడానికి బదులు..ఆమె పాల్గొనే కార్యక్రమానికి అక్కడి ప్రభుత్వం అనుమతివ్వలేదన్నారు. ఇటువంటి చర్యలతో మమత ప్రభుత్వం రాష్ట్రపతిని మాత్రమే కాకుండా భారత రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని అన్నారు. ద్రౌపదీ ముర్ము ఎంతో కష్టపడి దేశంలోని అత్యున్నత స్థానానికి ఎదిగారని మోదీ పేర్కొన్నారు. మురికి రాజకీయాలు చేసే తృణమూల్‌కు బెంగాల్ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగ నున్న బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించేది భాజపానేనని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగానే తప్పుడు ఆరో పణలు చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం భాజపా దేశంలోని అత్యున్నత పదవిని దుర్వి నియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి స్థానాన్ని తాము గౌరవిస్తా మన్నారు. ఆ కార్యక్రమంలో ద్రౌపదీ ముర్ము పాల్గొం టారనే విషయంపై ఎటువంటి ముందస్తు సమాచారం లేదన్నారు.

# బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం..

## స్పందించిన చంద్రబాబు, పవన్





**అమరావతి, మార్చి 08 (నేటి మనదేశమ్) :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రొటోకాల్ కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన పర్యటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని.. రాష్ట్రపతి పదవిని అవ మానించేలా బెంగాల్ ప్రభుత్వం వ్యహరించడం బాధ కలిగించిందన్నారు. రాష్ట్రపతి పర్యటనలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఏ ప్రభుత్తమైనా రాష్ట్రపతి పట్ల అత్యంత గౌరవ, మర్యాదలతో మెలగాలి. రాజ్యాంగ సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయి. వాటి పవిత్రతను కాపాడుకోవడం సమష్టి విధి" అంటూ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందిం

తరువాయి 2లో..

# కూటమి ప్రభుత్వం వచ్చాక

## తిరుమలకు నెయ్యి సరఫరాలో రూ.200 కోట్ల స్కామ్



- సిబిఐ విచారణ కోరతాం
- వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల

**అమరావతి, మార్చి 08 (నేటి మనదేశమ్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలకు నెయ్యి సరఫరాలో రూ.200 కోట్ల స్కామ్ జరిగిందని వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు ప్రచారం వెనుక కుట్ర ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్ల డాక్యుమెంట్లలోనే అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయన్నారు. దీనిపై సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తామని తెలిపారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని సిఎం చెప్పిన తరువాత జరిగిన పరిణామాలు స్కామ్‌కు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. 2024 ఆగస్టులో రూ.351కి కిలోనెయ్యి సరఫరా చేశారని, అక్టోబరు 2025 నాటికి రూ.716కు పెంచారని తెలిపారు. కిలో నెయ్యికి రూ.365 పెంచారన్నారు. అంటే ఏడాదిన్నర కాలంలో ఒకటిన్నరెట్లు ధర పెరిగిందని పేర్కొన్నారు. 2025 అక్టోబరులో ఐదు లక్షల కేజీల సరఫరాకు సంగం డెయిరీకి రూ.599కి ఇచ్చారని తెలిపారు. ఎపి పరిధిలో డెయిరీలకు ఈ ధర నిర్ణయించారని పేర్కొన్నారు. 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న డెయిరీలకు 20 లక్షల కేజీలకు 2024 సెప్టెంబరులో టెండరు పిలిచారని తెలిపారు. మొదటి టెండర్లో కెఎఫ్‌ఎం ఒక్కటే రావడంతో టెండరు రద్దు చేశారని పేర్కొన్నారు. రెండోసారి పిలిచినా అదే సంస్థ వచ్చిందని వివరించారు. సింగిల్ బిడ్డర్‌గా కెఎఫ్‌ఎంకు 20 లక్షల కేజీల ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. వెంటనే అందులో పదిలక్షల కేజీల ఆర్డర్‌ను వెనక్కు తీసుకుని హెరిటేజ్ అనుబంధ

తరువాయి 2లో..

# రూ.1013.23 కోట్ల మెగా చెక్కులు అందజేసిన జిల్లా కలెక్టర్

## మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా లబ్ధిదారులకు అందజేత




**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, మార్చి 08 :** 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాల కింద బ్యాంకు లింకేజి కింద సమకూర్చిన రూ.1013.23 కోట్ల విలువగల మెగా చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అందజేశారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు సాధించిన ప్రగతిని వివరిస్తూ డి.ఆర్.డి.ఎ., మెప్మా శాఖలు లబ్ధిదారులకు అందజేసిన రుణాలు, ఇతర ఆర్థిక సాయం తాలుక నివేదికలను ఆదివారం ఏయూ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించాయి. దానిలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పథకాల కింద లబ్ధిపొందిన మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు సిద్ధం చేశారు. వాటిని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి చేతుల మీదుగా అందజేశారు. వాటిలో డి.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో సమకూర్చిన

తరువాయి 2లో..

# నిరుద్యోగులకు నెలకు రూ.1500

## పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

వార్త... 2 లో

మొదటిపేజీ తరువాయి...

## ప్రపంచ దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర

ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ఐటీ రంగం నుండి గ్రీన్ ఎనర్జీ వరకు, జనాభా విధానం నుండి ఏఐ వరకు భవిష్యత్ భారత్ ఎలా ఉండబోతోందో తన విజన్‌ను పంచుకున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిప్లొమాట్లు భారతీయులేనని చంద్రబాబు కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా స్థానిక సంస్కృతులతో కలిసిపోవడంలో భారతీయులకు మించిన వారు లేరన్నారు. నవ్యాంధ్రను డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధిస్తోందని, భవిష్యత్తులో దేశం విద్యుత్తును ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఏఐ , క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్ రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి నిదర్శనంగా ఇటీవల శిక్షణ కోసం పిలుపునిస్తే 50 వేల మంది యువత రిజిస్టర్ చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. దేశం ఎదుర్కోబోతున్న 'ఏజింగ్' అంటే వృద్ధాప్య జనాభా సమస్యపై చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. గతంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన తాను, ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తించి 'జనాభా నిర్వహణ' గురించి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఏపీలో ఫెర్టిలిటీ రేటును 1.5 నుండి 2.1కు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను వివరించారు. మూడో బిడ్డ పుడితే రూ. 25 వేల ఆర్థిక సాయంతో పాటు, ప్రతి నెలా రూ. 1,000 అందించాలని నిర్ణయించాం అన్నారు. తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై ఆలోచన చేస్తున్నాం. గతంలో భారతదేశంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దేశానికి పెద్ద ఆస్తి అని, ప్రస్తుతం మైక్రో ఫ్యామిలీల వల్ల వస్తున్న మార్పులపై ప్రజల దృక్పథం మారాలని ఆయన పిలుపునిచ్చారు.

## బెంగాల్‌లో రాష్ట్రపతికి చేదు అనుభవం..
### స్పందించిన చంద్రబాబు, పవన్

చారు. ఇది అత్యంత విచారకరమైన ఘటన అని పేర్కొన్నారు. “మన దేశంలో రాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యాంగ హోదా కలిగి ఉంది. ఆ పదవికి ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవాన్ని ఇవ్వాలి. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేలా చూడటం సంబంధిత యంత్రాంగం బాధ్యత” అని పేర్కొన్నారు.

## మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం


అక్కసుతో రద్దుచేసిందని తెలిపారు. హెచ్‌పివి వ్యాక్సిన్ల ఉచిత పంపిణీ 14 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న 3.45 లక్షల మంది బాలికలకు పంపిణీ చేసే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కాబోతుందని వెల్లడించారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్లు పెరగకుండా కట్టడి చేసేందుకు వీలవుతుందని చెప్పారు. రక్తహీనత కలిగిన గర్భిణులకు కార్బాక్సీమాల్టోజ్ ఇంజెక్షన్లను ఇచ్చే కార్యక్రమం త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కాబోతుందన్నారు. గత ఏడాది సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు తొలివారం నిర్వహించిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' కింద బీపీ నుంచి క్యాన్సర్ వరకు 57.11 లక్షల మంది మహిళలు, చిన్నారులు వైద్య సేవలు పొందారని గుర్తు చేశారు.

## కూటమి ప్రభుత్వం వచ్చాక
## తిరుమలకు నెయ్యి సరఫరాలో రూ.200 కోట్ల స్కామ్

ఇందాపూర్‌కు ఇచ్చారని తెలిపారు. తాను సరఫరా చేయలేనన్న కెఎఫ్‌ఎంతోనే మరలా పదిలక్షల కేజీలకు రూ. 750తో టెండర్ వేయించారని వివరించారు. చివరకు ఇందాపూర్‌కు రూ.658కి ఇచ్చారన్నారు. ఇదే సంస్థ డెయిరీ నెయ్యి ఆన్‌లైన్లో రూ.519కి దొరుకుతుందని చెప్పారు. కెఎఫ్‌ఎం కోట్ చేసిన ధరను పరిగణనలోకి తీసుకుని సంగం డెయిరీకి 75 వేల కిలోల నెయ్యి సరఫరాను రూ.599కి ఇచ్చారని అన్నారు. పేరుకు నాలుగు సార్లు టెండర్లు వేసినట్లు చూపించారని, వాస్తవంలో సంగం తప్ప మరే డెయిరీ బిడ్డింగ్ వేయకుండా అడ్డుకున్నారని వివరించారు. లడ్డూ విషయంలో రాజకీయ దుమారం రేపుతూ ఒక పథకం ప్రకారం దోపిడీ చేస్తున్నారని అన్నారు. దీనికి టిటిడి ఛైర్మన్ లాంటి వాళ్లను వాడుకుంటున్నారని ఆరోపించారు.

## రూ.1013.23 కోట్ల మెగా చెక్కులు అందజేసిన జిల్లా కలెక్టర్

రూ.256.14 కోట్ల చెక్కు, జీవీఎంసీ - అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యు.సి.డి.) సమకూర్చిన రూ.747.69, పీఎం స్వానిధి కింద సమకూర్చిన రూ.9.40 కోట్ల విలువ గల చెక్కులు ఉన్నాయి.డి.ఆర్.డి.ఎ. పీడీ లక్ష్మీపతి, అదనపు కమిషనర్ సత్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్)**

రాష్ట్ర సమాచార కమిషనర్ గౌరవనీయులు పి.ఎస్ నాయుడు అనకాపల్లి పర్యటనలో సతీ సమేతంగా అనకాపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ ని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు భక్తులు ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవస్థానం తరఫున శాలువా కప్పి సన్మానించడం జరిగింది. అదేవిధంగా విశాఖపట్నం అదనపు ప్రభుత్వ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు తన స్వస్థలమైన పాత కన్నూరు పాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న శ్రీ ముత్యమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన గ్రామానికి విచ్చేసిన సందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పెద్దలు మరియు స్థానిక నాయకులు కలిసి ఆయనను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల విశాఖపట్నంలో అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన సందర్భంగా కన్నూరు అప్పలనాయుడు ని గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తూ ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయన మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను రాష్ట్ర సమాచార కమిషనర్ కి తెలియజేశారు. ముఖ్యంగా పాత కన్నూరు పాలెం గ్రామానికి స్వంత పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల మరియు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ప్రత్యేక పంచాయతీ అవసరమని వారు వివరించారు.

## మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి
### - రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్





**అనంతగిరి, మార్చి 08 (నేటి మనదేశమ్) :** పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలోని ఎస్.ఆర్. శంకరన్ ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కీలక శక్తిగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళలు బలపడితే సమాజం బలపడుతుంది... మహిళల అభివృద్ధే దేశ అభివృద్ధికి పునాది, అని ఆయన అన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ లందరికీ హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పి అమిత్ బర్దార్, పాడేరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద సృజనాత్మక కళల చైర్మన్ గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ నాగరాజు, ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్
## మహిళల ఆరోగ్యంపై వ్యాక్సినేషన్ అవగాహన సదస్సు




**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** అంతర్జాతీయ మహిళా దినోత్స వం సందర్భంగా మహిళల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, ఎంవీపీ యూనిట్‌లో గైనకాలజీ వైద్యులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి వ్యాక్సినేషన్ ఎంతో ముఖ్యమని వైద్యులు వివరించారు. వైద్యుల ప్రకారం, చాలా మంది వ్యాక్సిన్లు చిన్నపిల్లలకు మాత్రమే అవసరం అని భావిస్తారు. అయితే మహిళలు కూడా తమ జీవితంలోని వివిధ దశల్లో కొన్ని ముఖ్యమైన టీకాలు తీసుకోవడం ద్వారా అనేక ప్రమాదకరమైన వ్యాధులను నివారించవచ్చు. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని గైనకాలజీ నిపుణులు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్‌లలో ఒకటిగా ఉండగా, సమయానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వారు వివరించారు. సాధారణంగా 9 నుండి 26 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు మరియు యువతులు ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచించారు. అదేవిధంగా గర్భిణీ మహిళలు కూడా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన టీకాలు తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు తెలిపారు. గర్భధారణ సమయంలో టిటానస్ వంటి టీకాలు తీసుకోవడం ద్వారా తల్లి మరియు శిశువును కొన్ని ఇన్‌ఫెక్షన్ల నుండి రక్షించవచ్చని చెప్పారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు మరియు వ్యాక్సిన్లు తీసుకోవాలని వైద్యులు సూచించారు. మహిళల ఆరోగ్యం కుటుంబం మరియు సమాజ ఆరోగ్యానికి కూడా ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐతీ కిరణ్మయి, ఐతీ వినీల, ఐతీ తనూజ, ఐతీ శాంతి, ఐతీ సౌమ్య, డైటీషన్ శ్రావ్య మరియు సెంటర్ హెడ్ ఐతీ అరుణ్ కుమార్ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం కోసం మెడికవర్ హాస్పిటల్స్ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తుందని వైద్యులు తెలిపారు.

## నిరుద్యోగులకు నెలకు రూ.1500
### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**పశ్చిమ బెంగాల్, మార్చి 08 :** త్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని పదో తరగతి పాసై ఉద్యోగాలు లేని వారికి నెలకు రూ.1500 నిరుద్యోగ భృతి అందించనున్నట్లు వెల్లడించారు. నేటి నుంచే ఈ డబ్బులు నిరుద్యోగుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. యువ సాథి అనే ఈ స్కీమ్ 21-40ఏళ్ల వారికి వర్తిస్తుందని తెలిపారు. ఈ సాయంతో వారు స్వయం సమృద్ధిగల భవిష్యత్తు వైపు పయనించగలుగుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యువ సాథి స్కీమ్‌ను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ముందు భావించినట్లు మమత తెలిపారు. అయితే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా.. కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. తమ పాలనలో బెంగాల్‌లో నిరుద్యోగిత రేటు 40శాతం తగ్గిందని సీఎం తెలిపారు. ప్రభుత్వం దాదాపు 40లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించిందని.. వారిలో 10 లక్షల మంది ఇప్పటికే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇప్పటికే ఏడాదికి రూ.10వేలు ఇస్తోందన్నారు. బెంగాల్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.

## వైభవంగా శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట
### పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు



**అనకాపల్లి, మార్చి 08 (నేటి మనదేశమ్) :** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి నూతన ఆలయ పునఃప్రతిష్ట మరియు రాజగోపుర కలశ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక గవరపాలెంలో వెలసిన అమ్మవారి ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతితో కలిసి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న స్పీకర్ దంపతులకు స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మేళతాళాలు మరియు పూర్ణకుంభంతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన ప్రధాన ఆలయ మండపంలో నిర్వహించిన పసిడి కలశాల నీరాజనం మరియు కలశ ప్రతిష్టా కార్యక్రమాల్లో వారు శాస్త్రోక్తంగా పాలుపంచుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ దంపతులు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దంపతులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను తదితరులు తమ సతీమణులతో కలిసి పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో పులకించింది. కోలాటాలు, శక్తి వేషధారణలు, భరతనాట్య ప్రదర్శనలు మరియు కేరళ డప్పు వాయిద్యాల హోరుతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అనకాపల్లి పురవీధులు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి ఆశీస్సుల కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు.

## దివిస్ నారి ప్రో కబడ్డీ లీగ్ 2026 ముగింపు..



**భీమునిపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** స్థానిక భీమిలి మండలం చిప్పాడ దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ దివిస్ నారి ప్రో కబడ్డీ లీగ్ సుమారు ఏడు పంచాయతీల్లో నుంచి 8 మహిళా కబడ్డీ జట్టులకు శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు మొత్తంగా 15 మ్యాచ్ లు కబడ్డీ పోటీలు నిర్వహించగా, చిప్పాడ పంచాయతీకి చెందిన చిప్పాడ సిందూర్ , చెరుకుపల్లి త్రిశూల్ టీం ఫైనల్ కి రాగా భీమిలి ఆర్ డీ ఓ సంగీత్ మాధుర్ చేతుల మీదుగా తాసేసి మ్యాచ్ ప్రారంభించారు. చిప్పాడ సిందూర్ దివిస్ జనరల్ మేనేజర్ వైయస్ కోటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి జగదీష్ గ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంది, ఈ కార్యక్రమంలో దివిస్ వరహాలరెడ్డి ,సి ఎస్ ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ ,వి శ్రీనివాసరా వు ,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ,పి అప్పారావు రిఫరీ బోర్డు కన్వీనర్ ,ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్,,ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ టీం,సి ఎస్ ఆర్ ప్రతినిదులు ఏ శ్రీని వాస్, బిందు ,కే నరసింహ ,పి శేఖర్ బాబు ఆర్గనైజర్స్ మహే ష్ ,లక్ష్మి,క్రీడాకారులు తదిత రులు పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**మెటీరియల్స్ సరఫరా చేయుట**

(1) టెండరు నెం. 30257203A, తేదీ. 27.02.2026
పని పేరు: వైడ్ బేస్ కర్వ్ PSC స్లీపర్లు (RT-8979-8982) కొరకు కర్వ్ చెక్ రైల్ (RT-8985)నకు CI బ్రాకెట్స్ సప్లయి చేయుట. వారంటీ కాలం: సప్లయి తేదీ తర్వాత 30 నెలలు. పరిమాణం: 39332 నెంబర్లు.

(2) టెండరు నెం. 30265150, తేదీ. 27.02.2026
పని పేరు: బ్రాడ్ గేజ్ ట్రాక్ మెయింటెనెన్స్ కొరకు ఎలక్ట్రానిక్ ట్రాక్ మరియు టర్నవుట్ గేజ్ సప్లయి చేయుట. వారంటీ కాలం: సప్లయి తేదీ తర్వాత 30 నెలలు. పరిమాణం: 139 నెంబర్లు.

వారంటీ కాలం: డెలివరీ తేదీ తర్వాత 30 నెలలు. (రెండు టెండర్ల కొరకు). తనిఖీ చేయు వారు: TPI ఏజన్సీ (రెండు టెండర్ల కొరకు).

సూచన: మెటీరియల్‌ను 30 నెలలులోగా (వ.నెం. 1 కొరకు) మరియు 90 రోజులలోగా (వ.నెం. 2 కొరకు) సప్లయి చేయవలెను.

టెండరు తెరచు తేదీ & సమయం: 30.03.2026న 1500 గంటలకు (రెండు టెండర్ల కొరకు).

పూర్తి వివరములు లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్, వాల్తేరు

PR-1193/Q/25-26

# నేటి మనదేశమ్ సంపాదకీయం

## మహిళలకు వందనాలు

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మీ, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగ వస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్దరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సోవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్దరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరివించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు.

1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది. లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం. ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంత ర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృత జ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించి నట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**విశాఖపట్నం, మార్చి 08 నేటి మనదేశమ్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు మాధవదారలోని శ్రీ మాధవ స్వామి కళ్యాణ మండపంలో జరిగింది. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోన్ ఫైవ్ కమీషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన విశాఖ ఉత్తర నియో జకవర్గం శాసనసభ్యులు, భాజపా శాసనసభ పక్షనేత పెనుమత్స విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ సమాజ రూపకల్పనలో మహిళల పాత్ర ప్రధానమైనదని, మహిళల స్వాలంభనతో దేశం ఆర్థికంగా బలపడు తుందని అన్నారు. మంచి కుటుంబం.తద్వారా మంచి సమాజం ఏర్పడడానికి తల్లిగా మహిళలు పోషిస్తున్న పాత్ర అమోఘమైనదని అన్నారు. తదనంతరం ముఖ్య అతిధి విష్ణు కుమార్ రాజు చేతులు మీదుగా స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్, ఎపి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం నాయకుడు సనపల వరప్రసాద్, బిజెపి నాయ కురాలు పెనుమత్స శ్యామలా దీపికా, ఎపిడిఓ పుణ్యవతి, ఎపి యస్సీ కార్పొ రేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత,కార్పోరేటర్ ముక్కా శ్రావణి,మార్కెటింగ్ డైరెక్టర్ టి. పద్మజా, జయశ్రీ ఇతర కూటమి నాయకులు, మహిళలు ప ఎత్తున పాల్గొన్న ఈ కార్య క్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


### డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో

# ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్
- పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కారం
- మహిళ సాధికారతతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్న వక్తలు



**విశాఖపట్నం, మార్చి 08 నేటి మనదేశమ్:** మహిళలు విద్య, ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదిగినప్పుడే మహిళ సాధికారత సాధ్యమని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను పురస్క రించుకొని అల్లిపురం నేరెళ్ల కోనేరు వద్ద విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయ కులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళా పోలీసులు, మహిళా వైద్య సిబ్బంది, అధ్యాపకురాళ్లు, మహిళా పాత్రికే యురాళ్లను డాక్టర్ కందుల నాగరాజు,నళిని దేవీ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో రాణిస్తున్నారని కొని యాడారు. మహిళ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుం దన్నారు. ప్రతి మహిళా విద్యావంతురాలై ఆర్థిక గా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందు తుందని అన్నారు. విశాఖ దక్షిణ నియో జకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అల్లిపురంలోని నేరెళ్ల కోనేరులో గల తమ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళ మూర్తులను ఈ సందర్భంగా అతిధుల చేతుల మీదుగా ఘనంగా సత్కరిస్తూ వారిని ప్రోత్స హిస్తూ వస్తున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం కూడా మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. మహిళ లేనిదే జీవితం లేదని, అన్నింటికీ మూలం మహిళ అని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అద్భుతంగా రానిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళా అభ్యుదయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని వెల్ల డించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎంఏ టైప్ 1 అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేట కు చెందిన ముని ఆనంద్ కుమారుడు రుషి కుమార్ అనే 5ఏళ్ళ లోపు బాబుని నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ బొడ్డు అప్పల కొండమ్మ,మాజీ కార్పొరేటర్ బొడ్డు అప్పలనాయుడు ఆదివారం (08-03-2026)న పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా అప్పల నాయుడు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన ముని రుషి కుమార్ అరుదైన వ్యాధికి గురవటం బాధాకరమన్నారు. ఇలాంటి వ్యాధి ఎవరికి రాకుడదని భగవంతుని ప్రార్ధిస్తున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్ర నాగవంశం కుటుంబీకులందరూ సహచర నాగవంశీయునికి అండగా నిలవాలని కోరారు. సహృదయులందరూ ఫండ్ రైజింగ్ ద్వారా సహాయం చేయాలని, అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ బాబుకి 16 నుండి 18 కోట్ల రూపాయల విలువైన ఇంజక్షన్ అందచేయాలని ప్రభుత్వాని కోరారు. ఈ ఇంజెక్షన్ ధర చాలా ఎక్కువగా ఉండటం వల్ల మధ్యతరగతి కుటుంబాలకి ఇది బరించలేని భారం కాబట్టి, అవకాశమున్న ప్రతీ ఒక్కరూ మీ శక్తి కొలది విరాళాలు అందజేసి, ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి చేరేలా షేర్ చేసి, ఈ పసివాని ప్రాణాని కాపాడదమని అప్పలనాయుడు కొరారు. ( **విశాఖపట్నం, మార్చి 08 నేటి మనదేశమ్)**

### రోటరీ క్లబ్ మరియు ఆయుర్ జీవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రోత్సాహ కార్యక్రమం




**విశాఖపట్నం, మార్చి 08 నేటి మనదేశమ్:** రోటరీ క్లబ్ మరియు ఆయుర్ జీవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రోత్సాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్లాంకులు, పెన్లు, స్కేలు, పెన్సిల్స్, పౌచ్‌లు, ఇరేసర్లు, షార్పనర్లు పంపిణీ చేశారు. అలాగే బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి " బాలల హక్కులు- చట్టాలు" పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్ జీవ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ "విద్యే మనిషి జీవితాన్ని మార్చ గలిగే గొప్ప శక్తి." విద్యార్థులు పరీక్షల సమ యంలో భయపడకుండా ముందుగా ప్రశ్న పత్రాన్ని జాగ్రత్తగా చదవాలని, తెలిసిన సమా ధానాలను స్పష్టంగా రాయాలని సూచించారు. ఎల్లప్పుడూ సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని కోరుతూ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు అల్తఫ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధైర్యంగా ముందుకు సాగాలని, ఈ పరీక్షలు వారి భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన రోటరీ క్లబ్ మరియు ఆయుర్ జీవ ఫౌండేషన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ముస్తి అల్తాఫ్, సభ్యులు, ఆయుర్ జీవ ఫౌండేషన్ సభ్యురాలు పవిత్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అంబేద్కర్ స్కూల్ సుభప్రదమ్ గా పూర్తి చేశారు.

# అక్రమాలకు పాల్పడుతున్న దిల్షా సింగ్ ఆనంద్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**- సతీందర్ సింగ్‌సేతి డిమాండ్**



**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, మార్చి 08 :** సీతమ్మధార గురుద్వారా సాధ్ సంగత్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న దిల్షా సింగ్ ఆనంద్ అక్రమాలకు పాల్పడుతున్నారని సిక్కు మైనారిటీ నాయకుడు సతిందర్ సింగ్ సేతి ఆరోపించారు. గురుద్వార్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుద్వారా ఆస్తులను, ఆదా యాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని స్వప్రయో జనాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. సొసైటీ పేరిట ఉన్న గురుద్వారా సత్సంగ్ ను గురుద్వారా సత్సంగ్ ట్రస్ట్ పేరిట అక్టోబర్ 2022లో రిజిస్టర్ చేసి నిధులు మళ్ళిస్తున్నారని మండిపడ్డారు. సీతమ్మధార గురుద్వారా తోపాటు సూర్య బాగ్ లో ఉన్న గురుద్వారా ఆస్తికి సంబంధించి అద్దెలను స్వాహా చేస్తు న్నారని అన్నారు. తన వద్ద ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలి పారు. ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో కొందరు లాలూచీపడి అక్రమాలకు సహ కరిస్తున్నారని ఆరోపిం చారు. దీంతో సిక్కు సామా జిక వర్గానికి అన్యా యం జరుగుతోందని అన్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో సొసైటీ పేరిట గురుద్వారా నిర్వ హణ జరుగుతోందని అన్నారు. అయితే దిల్ షా సింగ్ ఆనంద్ అధ్యక్షుడిగా కొనసాగుతూ గురుద్వారా తన సొంత జాగీరులా వ్యవ హరిస్తున్నారని మండిపడ్డారు. ఆయన అక్రమాలు, మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు పూర్తి ఆధారాలతో నిరూ పించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధి కారులు స్పందిం చాలని కోరారు ఈ అంశాన్ని మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్, మంత్రి అనిత దృష్టికి తీసు కెళ్తానని చెప్పారు. అక్రమాలకు పాల్పడుతున్న దిల్షా సింగ్ ఆనంద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని సతీందర్ సింగ్ సేతి డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయ పోరాటం కూడా చేస్తామని హెచ్చరించారు.

# సమన్వయంతో నూకాలమ్మ ఉత్సవాలు విజయవంతం

### సమీక్షలో గంటా సూచన



**భీమునిపట్నం, మార్చి 08 నేటి మనదేశమ్:** భీమిలి నూకాలమ్మ ఉత్సవాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. ఉత్సవ ఏర్పాట్లపై భీమిలి క్యాంప్ కార్యా లయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. విరాళాలిచ్చే దాతలకు దర్శనాల్లో ఇచ్చే వెసులుబాటు సామాన్య భక్తులకు ఇబ్బంది కాకుండా చూసుకోవాలని చెప్పారు. పార్కింగ్.. ట్రాఫిక్ తదితర అంశాల్లో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీరు, మొబైల్ టాయ్ లెట్లు, పారిశుధ్య పరంగా తీసుకుంటున్న చర్యలను జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్ వివరించారు. భక్తులకిచ్చే పులిహోర, లడ్డు ప్రసాదాలను గత ఏడాది కంటే అధికంగా పంపిణీ చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఉత్సవ వినోద కార్యక్రమాలు ప్రదర్శించే సమయాన్ని రాత్రి 1 వరకూ పెంచాలన్నారు.

ఉత్సవ ఆదాయంలో కొంత భాగాన్ని నిర్వహణ కోసం దేవాదాయ శాఖ కమిటీకి అందించాలని కోరారు. సంప్రదాయ వ్యవహారాలను కమిటీ చూసుకుంటే.. ఏర్పాట్ల విషయాలను అధికార యంత్రాంగం పర్యవేక్షి స్తుందని గంటా పేర్కొన్నారు. వేటపాలెం దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని బాణాసంచా కాల్చడంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

సమావేశంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, ఏసీపీ అప్పలరాజు, ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహా చలం నాయుడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, షణ్ముఖరావు, కరుణాకర్ రెడ్డి, తమ్మిన సూరిబాబు, గాడు యశ్వంత్, గొలగాని నరేంద్ర, కింగ్, పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# దానిమ్మపండుతో కలిగే లాభాలు



దానిమ్మపండు పండు రక్తహీనతను తగ్గిస్తుంది.దానిమ్మపండు రక్తనాళాలను శుభ్రపరుస్తుంది. మలానికి మంచి రక్త ప్రసరణ కారణంగా ఒక వ్యక్తి చురుకుగా ఉంటాడు. బరువు తగ్గడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మరియు రోగనిరోధక శక్తిని పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను పొందడానికి దానిమ్మపండు తినడం ఒక రుచికరమైన మార్గం.

# గంజితో జుట్టు సమస్యలకు చెక్



గంజిలో ఉండే బి, ఇ, సి విటమిన్లు జుట్టుకు పోషణనిచ్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. కప్పు గంజి, చెంచా నిమ్మరసం, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి ఆ మిశ్రమాన్ని తలకు రాసి, ఆపై గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే కుదుళ్లు బలంగా మారుతాయి. గంజికి కాస్త మజ్జిగ కలిపి తలకు రాయాలి. అరగంట తర్వాత తక్కువ గాఢత గల షాంపూతో తలస్నానం చేస్తే కుదుళ్లు బలపడతాయి. కప్పు గంజిలో కాస్త నిమ్మరసం, చెంచా పెరుగు కలిపి రాస్తే జుట్టు మెరుస్తుంది.

# పేగు ఆరోగ్యానికి దివ్యౌషధం ఇదే..!



చిప్స్, చాక్లెట్స్ వంటి అనారోగ్యకర స్నాక్స్ తీసు కుంటున్నారని కింగ్స్ కాలేజ్ లండన్ పరిశోధకులు పేర్కొన్నారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురిత మయ్యాయి. వీరు నాలుగు వారాల పాటు పలువురు పార్టిసిపెంట్స్‌పై పరిశోధన జరపగా బాదం పప్పు అధికంగా తీసుకున్న వారిలో ప్రేవుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపినట్టు గుర్తించారు.

బాదంలో ఉండే ఆరోగ్యకర కొవ్వులు, ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఈతో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడైంది. బాదం తినడం ద్వారా శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపేలా బ్యాక్టీరియల్ జీవక్రియలు వేగవంతమవుతాయని పరిశోధకులు తెలిపారు. ప్రేవుల్లో గుడ్ బ్యాక్టీరియా పెరిగేందుకు ప్రొబయాటిక్స్‌ను ప్రేరేపించడంలో ఫైబర్ కీలకంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రతివారం పలురకాల బీన్స్, అవకాడోలు, కూరగాయలు, ప్రిబయాటిక్స్తో పాటు పెరుగు వంటి ఆహారం తీసుకోవడం ద్వారా ప్రేవుల ఆరోగ్యం మెరుగై శారీరక ఆరోగ్యం చేకూరుతుందని పరిశోధకులు వెల్లడించారు.

ప్రేవులు ఆరోగ్యంగా ఉంటే శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయో జనాలు చేకూర ుతాయి. ఆరోగ్యవంతమైన ప్రేవులతో ఒత్తిడి, కుంగు బాటు, మధుమేహం, హృద్రోగ, ఊబకాయం వంటి పలు అనారోగ్య ముప్పులను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. దురదృష్టవశాత్తూ 40 శాతం మంది పెద్దలు ప్రేవు సమస్యలు, జీర్ణసంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రేవుల ఆరోగ్యానికి నట్స్ దివ్యౌషధంలా పనిచేస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. శరీరారోగ్యానికి పలు రకాల నట్స్, తృణధాన్యాలు ఉపయోగపడినా ప్రేవుల ఆరోగ్యానికి బాదం పప్పు అత్యుత్తమమని ఈ అధ్యయనం తేల్చింది.మెరుగైన మెమరీకి బాదం తీసుకోవాలని పెద్దలు చెబుతుంటారు. అయితే ఫైబర్ అధికంగా ఉండే నట్స్‌ను పెద్దలు తగినంతా తీసుకోవడం లేదని,

# నిమ్మరసం వలన కలిగే ప్రయోజనాలు



నిమ్మరసాన్ని రోజూ గ్లాస్ వేడి నీటిలో కలిపి తాగితే చాలా రోగాలు మన దరిచేరవు. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును నిమ్మరసం కరిగించేస్తుంది. అధిక బరువును తగ్గిస్తుంది. రక్త సరఫరా సాఫీగా సాగుతుంది. గుండె సంబంధిత సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి. మధుమేహం కంట్రోల్‌లో ఉండటానికి నిమ్మరసం తాగడం ఎంతో ఉత్తమం. వేడి నీటితో కలిపిన నిమ్మరసం తాగితే శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి.

# ఆరోగ్యానికి మేలు చేసే బ్రహ్మీ ఆకులు



మన కళ్లెదుట మొక్కలు కనిపిస్తున్నా.. వాటిని పిచ్చి మొక్కల్లానే అనుకుంటాం. వాటివల్ల ప్రయోజనం ఏమీ ఉండదులే అని తేలిగ్గా తీసిపారేస్తుంటాం. అయితే కొన్ని మొక్కలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని చేకూరుస్తాయి. వాటిల్లో ప్రధానంగా బ్రహ్మీ మొక్క గురించే చెప్పుకోవాలి. ఈ మొక్క ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. బ్రహ్మీ ఆకులు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని కొన్ని పరిశోధనల్లో కూడా తేలింది. బ్రహ్మీ ఆకులు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ఆకుల్ని మెత్తగా నూరి రోజుకు రెండుసార్లు మోతాదు మించకుండా 300 మిల్లీ గ్రాములు చొప్పున తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేస్తుందని పరిశోధకులు కనుగొన్నారు.

# ఫ్యాటీ లివర్‌ని తగ్గించే పండ్లు ఇవే



శరీరంలో జీవక్రియలు సరిగ్గా జరగడానికి లివర్ (కాలేయం) చాలా అవసరం. అయితే, కొందరిలో లివర్‌లో కొవ్వు చేరడం వల్ల ఫ్యాటీ లివర్ అనే డిసీజ్ వస్తుంది. దానివల్ల లివర్ పని తీరు దెబ్బతినడమే కాకుండా లివర్ క్యాన్సర్ కూడా వచ్చే అవకాశం ఉంది. డయాబెటిస్, ఒబెసిటీతో పాటు జంక్‌ఫుడ్ వంటివి ఈ సమ్యను పెంచుతాయి. ఈ డిసీజ్ నుంచి తొందరగా కోలుకునేందుకు, ఈ సమస్య రాకుండా జాగ్రత్తపడేందుకు పండ్లు, కూరగాయలతో పాటు ఫైబర్ ఎక్కువ ఉండే ఫుడ్ తినాలని సూచి స్తున్నారు డైటీషియన్లు. ఫ్యాటీ లివర్ సమస్య నుంచి బయటపడేసే పండ్లు ఏంటంటేఞా

**ద్రాక్ష:** వీటిలో ఫ్యాటీ లివర్ సమస్యని తగ్గించడంలో ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. ద్రాక్షలోని విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని చెడు పదార్థాల్ని బయటకు పంపిస్తాయి. లివర్‌లో ఫ్యాట్ చేరకుండా చూస్తాయి. దాంతో లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.

**అవకాడో:** ఇందులో హై డెన్సిటీ లిపోప్రొటీన్ (హెచ్‌డిఎల్) అనే మంచి కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇది లివర్‌లో చేరిన లో డెన్సిటీ లిపోప్రొటీన్ (ఎల్‌డిఎల్) అనే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. అవకాడోలోని యాంటీఆక్సిడెంట్లు రక్తంలోని లిపిడ్స్‌ని కంట్రోల్‌లో ఉంచుతాయి. ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నవాళ్లు అవకాడో తింటే ఆ సమస్య నుంచి తొందరగా బయటపడతారు.

**బ్లూ బెర్రీలు:** వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. ఇవి లివర్‌ని ఆరోగ్యంగా చేస్తాయి. డయాబెటిస్ బారి నుంచి కాపాడతాయి కూడా. బ్లూ బెర్రీ పండ్లని రోజూ తింటే ఫ్యాటీ లివర్ సమస్య నుంచి తొందరగా కోలుకోవచ్చు.

**యాపిల్:** రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం రాదంటారు. ఇందులోని ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండులోని ఫైబర్ లివర్‌లోని అదనపు ఫ్యాట్‌ని తొలగిస్తుంది.

**అరటిపండు:** ఈ పండులో విటమిన్ బి6, విటమిన్-సి, ఎ ఉంటాయి. ఇవి లివర్‌లోని ఫ్యాట్‌ని తగ్గించడంలో సాయపడతాయి. అందుకని ఈ సమస్య ఉన్నవాళ్లు రెగ్యులర్‌గా అరటిపండు తినాలి.నిమ్మరసం: ఇందులోని విటమిన్-సి, విటమిన్-ఎ వంటివి ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాదు లివర్‌లోని చెడు కొలెస్ట్రాల్‌ని తొలగిస్తాయి. రెగ్యులర్‌గా నిమ్మరసం తాగితే ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది.

# డెంగ్యూ జ్వరమొచ్చిందా? తస్మాత్ జాగ్రత్త



దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వస్తాయి. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమతెరల వాడకం కానీ, మస్కిటో నెట్స్ ఉపయోగించడం వంటి పద్ధతుల ద్వారా దోమల్ని నివారించవచ్చు.

- డెంగ్యూ ప్రాణాంతకం కానప్పటికీ.. శరీర రోగనిరోధకశక్తిపై చాలా ప్రభావం పడుతుంది. బంగ్లాదేశ్, భారత్, థారులాండ్ వంటి దేశాల్లో కోవిడ్ - డెంగ్యూ ఈ రెండు వ్యాధులు ఒకేసారి అటాక్ అయినట్లు పరీక్షల్లో వెల్లడైనట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే డెంగ్యూ వ్యాధికి తప్పనిసరిగా వెంటనే చికిత్స అందించాలి.

- డెంగ్యూ ఇన్ఫెక్షన్ నుంచి కాపాడుకోవాలంటే.. బొప్పాయి ఆకుల జ్యూస్ తాగితే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. బొప్పాయి జ్యూస్ తాగడం వల్ల.. రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గకుండా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

- డెంగ్యూ సోకితే.. తీవ్రమైన తలనొప్పి, కళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

# ఆవనూనెలో ఔషధ గుణాలు



పోపుల పెట్టెలో ఉండే ఆవాలు అందరికీ తెలిసినవే. వాటి నుంచి తీసిన నూనె కొంచెం ఘాటుగా ఉంటుంది. ఈ నూనెను వంటల్లోనే కాక, పెయిన్ రిలీవర్‌గా, కొన్ని కాస్మెటిక్ ప్రయోజనాల్లోనూ ఉపయో గిస్తారు. ఇతర నూనెలకు ప్రత్యామ్నాయంగా ఆవనూనెను వాడడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడ డంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నా యంటున్నారు ఆరోగ్య నిపుణులు. గుండె ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఆవనూనె ఔషధంగా పనిచేస్తుందని అధ్యయనాల్లో తేలింది. ఇందులో మోనో అన్ శ్యాచురేటెడ్ ఫ్యాట్స్, పోలీ అన్ శ్యాచురేటెడ్ ఫ్యాట్స్, ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవన్నీ గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఆవనూనె జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని పెంచుతుంది. శరీరంలోని టాక్సిన్లను తొలగిస్తుంది. యాంటీ బాక్టీరియా, యాంటీ ఫంగల్ లక్షణాలు కలిగివున్న ఆవనూనె ఇన్ఫెక్షన్ల నుంచి జీర్ణవ్యవస్థకు కాపాడుతుంది. ఇందులోని గ్లూకోసినోలేట్ క్యాన్సర్, ట్యూమర్లను అరికడుతుంది.

చిగుళ్లు, దంతాలను బలపరిచేందుకు ఆవనూనె సహకరిస్తుంది. దంతాలపై పేరుకుపోయిన ప్లేక్, బ్యాక్టీరియాను ప్రభావవంతంగా తొలగిస్తుంది. పంటినొప్పి, నోటి దుర్వాసనను అరికడుతుంది. సహజసిద్ధమైన టీత్ వైటనర్‌గా పనిచేస్తుంది. ఇది దగ్గు, జలుబు, ఆస్తమా, సైనసైటిస్ వంటి శ్వాసనాళ సంబంధింత సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. శరీరాన్ని వెచ్చగా ఉంచి, ముక్కు దిబ్బడను తగ్గించి, రెస్పిరేటరీ ట్రాక్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంథైరాయిడ్ సమస్యలున్నవారు ఆవనూనెను వాడితే మంచి ఫలితం ఉంటుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది.



# ఇంట్లోనే ప్రోటీన్ పౌడర్

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే.. తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా కొంతమంది పిల్లలు పాలు తాగమంటే..అస్సలు ఇష్టపడరు. వారికి పాలు తాగడం అలవాటు చేయాలనే తల్లులు.. బూస్ట్, హార్లిక్స్ వంటి పౌడర్స్‌ను కలిపి ఇస్తుంటారు. అయితే ఆ పౌడర్ల కంటే కూడా.. ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్‌ను తయారుచేసి ఆ పొడిని పాలల్లో కలిపి తాగిస్తే పిల్లల ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. మరి ఇంట్లోనే సులభంగా.. ఏయే ప్రొటీన్ పౌడర్స్‌ని ఎలా తయారురుచేయవచ్చో తెలుసుకుందామా..! విత్తనాలతో

చియా సీడ్స్ : 3 టేబుల్ స్పూన్లు, పొద్దుతిరుగుడు విత్తనాలు - మూడు టేబుల్‌స్పూన్లు, అవిసె గింజలు - మూడు టేబుల్‌స్పూన్లు, గుమ్మడికాయ గింజలు - నాలుగు టేబుల్‌స్పూన్లు, జొన్నలు - ఒక కప్పు. వీటితోపాటు మీకిష్టమైన విత్తనాల్ని మరికొన్నింటిని కలుపుకోవచ్చు. వీటిని వేయించుకుని పొడి చేసుకుని ఓ డబ్బాలో నిల్వ చేసుకోవాలి. పాలల్లో ఈ పొడితోపాటు, కొద్దిగా బెల్లం కలిపి చిన్నారులకు తాపిస్తే ఆరోగ్యానికి మంచిది. చిన్నారులకే కాదు.. ఈ పొడిని పెద్దలైనా తీసుకోవచ్చుౕజు, బాదం పొడి

పల్లీలు - పావుకప్పు, పిస్తాపప్పు - పావుకప్పు, బాదం - పావుకప్పు, జీడిపప్పు - పావుకప్పు, ఎండుకొబ్బరి - పావుకప్పు. వీటన్నింటిని కలిపి దోరగా వేయించుకుని పొడి చేసుకోవాలి. ఈ పొడిని పాలల్లో కలిపి తీసుకోవచ్చు. లేదా బెల్లం పాకంతో ఈ పొడిని కలుపుకుని లడ్డూలా తయారుచేసుకుని తినవచ్చు.

# జీవీఎంసీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- స్త్రీ శక్తి విలువ పెరిగింది
- జీవీఎంసీ ప్రాంగణంలో మహిళా పార్కు ఏర్పాటు చేస్తాం
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్ట్రీయల్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ , జెమ్స్ మహిళా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ మహిళ అధికారులు, ఉద్యోగులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్ట్రీయల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, స్త్రీ శక్తి చాలా గొప్పదని, అన్ని రంగాలలో పురుషుల తో సమానంగా వారి సేవలు వెలకట్టలేమని జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి పేర్కొన్నారు. భారతదేశంలో మహిళలకు ఒక గౌరవ స్థానం ఉందని, ప్రపంచంలోనే మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అయినప్పటికీ కొంత వివక్షత భారతదేశంలో 1920వ సంవత్సరం నుండి మహిళలకు ఓటు హక్కు కల్పించడం జరిగిందని, మహిళల యొక్క హక్కులను కాపాడవలసిన బాధ్యత మనపై ఉందని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి తెలిపారు. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ సకల దేవతలు ఉంటారని, మహిళలను అందరూ గౌరవించాలని, సృష్టికి మూలం స్త్రీ అని, పూలే వంటి సంఘ సంస్కర్తలు మహిళలు ఉన్నతకి ఎంతో కృషి చేశారని, నేడు ఉద్యోగం, కుటుంబ సమస్యలను ఎదుర్కొంటూ అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని అదనపు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. అనంతరం ఆయన రచించిన జగతికి ఆధారం మహిళ, అమ్మే ఆధారం పాటలను వినిపించారు. అనంతరం వేదిక నలంకరించిన జాయింట్ డైరెక్టర్ (అమృత్)



మహిళలు పనిచేస్తున్నారని, శ్రమించడంలో ఆడపిల్లలే ప్రథమ స్థానంలో ఉన్నారని, జీవీఎంసీ పరిధిలో ఎంతోమంది మహిళలు ఉన్నత స్థానంలో పనిచేస్తూ జీవీఎంసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, గతంలో పనిచేసిన మహిళ కమిషనర్ సృజన నిర్ణయాలు చాలా గొప్పగా ఉండేవని కొనియాడారు. మహిళల కొరకు జీవీఎంసీ ప్రాంగణంలో ప్రత్యేకంగా మహిళా పార్కును ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. అనంతరం అన్ని రంగాలలో పురుషులతో సమానంగా కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాన్ని నడపడంలో ఒక్క మహిళలకే సాధ్యమని స్త్రీ శక్తి చాలా గొప్పదని బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత పేర్కొన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ అభివృద్ధికి మహిళల పాత్ర అధికంగా ఉందని మహిళలతోనే అభివృద్ధి సాధ్యమని, మీ బాధ్యతలు పై దృష్టి సారించి మీ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మీరు విధులు నిర్వహించాలని, మహిళలో చిన్నప్పటి నుంచే మనో ధైర్యాన్ని నింపాలని, మహిళలు ఇటు ఉద్యోగంతో పాటు ఇంటిని చక్కదిద్దే పనిని కూడా చేస్తారని, విజయభారతి తదితరులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని వారి సందేశాన్ని అందించారు. జీవీఎంసీ మహిళా అధికారులు, ఉద్యోగులు జీవీఎంసీ ప్రాగణంలో మహిళా పార్కు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందున మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జెమ్స్ సమకూర్చిన నిధుల నుండి మహిళలకు ఆటల పోటీలను, లక్కీ డిప్ లను ఏర్పాటు చేయగా, లక్కిడిపు లో మొదటి స్థానం లో పర్యవేక్షకులు హెన్నా, ద్వితీయ స్థానం లో లావణ్య, తృతీయ స్థానం లో సత్యకుమారి నిలవగా వారికి గిఫ్ట్ కూపన్లు, అలాగే మ్యూజికల్ చైర్, హౌసీ పోటీలలో గెలుపొందిన వారికి గిఫ్ట్ కూపన్ లను మేయర్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ ఏ రాజు, జేమ్స్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ, పర్యవేక్షకులు హెన్నా, సన్యాసి రావు, అధిక సంఖ్యలో జీవీఎంసీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

- స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి
- కోర్టు కేసుల పరిష్కారానికి జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ - విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహా విశాఖ నగరపాలక సంస్థ పై నమోద వుతున్న కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు నిత్య కృషి చేయాలని, జీవీఎంసీ పై ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పార్టీల ఫ్లోర్ లీడర్లు గంగారాం, గంకల కవిత, బీసెట్టి వసంత లక్ష్మి, జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు , జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ, జోనల్ కమిషనర్లు, అధికారులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ పై అధిక సంఖ్యలో కోర్టు కేసు దాఖలు అవుతున్నాయని వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించకపోవడం వలన పైకోర్టులను ఆశ్రయించవలసి వస్తుందని, తద్వారా జీవీఎంసీ కమిషనర్ కు ,అధికారులకు విధులకు ఆటంకం కలుగుతూ సమయం వృధా అవుతుందని అన్నారు. కొన్ని సందర్భాల్లో కమిషనర్ ఎక్కువగా కోర్టుకు స్వయంగా హాజరు కావాల్సి వస్తుందని, నూతనంగా నియమితమైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ పై నమోదవుతున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి జీవీఎంసీ అధికారులతో జోనల్ కమిషనర్లతో సంబంధిత కోర్టుల కేసులకు నిర్ణీత సమయంలో కౌంటర్లను దాఖలు చేసి, కేసులను పరిష్కరించి జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు నిత్యం కృషి చేయాలని కమిషనర్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులకు సూచించారు. కౌన్సిల్ తీర్మానం మేరకు ఈ విషయమై ఫ్లోర్ లీడర్లతో, జీవీఎంసీ అధికారులతో కౌన్సిల్ సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జీవీఎంసీ ఖాళీ స్థలాలు, పార్కులు, ఆక్రమణకు గురవుతున్నాయని, షాపులు కళ్యాణ మండపాలు సామాజిక భవనాలు తదితర జీవీఎంసీ ఆస్తులకు సంబంధించిన అద్దెలు ,లీజులపై కోర్టు కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వాటిని పరిరక్షించి, కేసులు పరిష్కరించే బాధ్యత స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పై ఉందని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ రెవెన్యూ పబ్లిక్ హెల్త్ తదితర విభాగాలకు సంబంధించి ఆస్తులు, ఖాళీ స్థలాలు, పార్కులు, సామాజిక భవనాలు ఆక్రమణకు గురవుతూ, భవన నిర్మాణాలపై అధికంగా కోర్టు కేసులకు గురవుతున్నాయని, అలాగే జీవీఎంసీ షాపులు, కళ్యాణ మండపాలు, మార్కెట్లకు సంబంధించి అద్దెలు, లీజులపై కోర్టు కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు నూతనంగా నియమితమైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ కేసులను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు.

అందుకే ప్రత్యేకించి ఈ సమావేశం అందరితో కలిసి నిర్వహించడం జరిగిందన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం ఉన్న కోర్టు కేసులపై క్షుణ్ణంగా విచారణ జరిపి అధికారులకు ,ఉద్యోగులకు సమావేశం నిర్వహించి ఎంఎస్సీలకు నిర్ణీత సమయంలో కోర్టు కేసులకు సంబంధించి సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మకు కమిషనర్ ఆదేశించారు. జీవీఎంసీ కేసులు త్వరగా పరిష్కరించేందుకు గాను పైకోర్టులు హైకోర్టుల వరకు కేసులు కొనసాగించకుండా ఉండేందుకు జీవీఎంసీ స్థాయిలో ఇండిపెండెంట్గా జ్యుడీషియల్ వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.




అనంతరం హాజరైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఒక్కొక్కరితో మాట్లాడుతూ వారికి ఇప్పటివరకు అందించిన కేసుల పై కార్యాచరణను అడిగి తెలుసుకుని , ప్రతి కేసుకు సంబంధించి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో కౌంటర్లను దాఖలు చేయాలని అందుకు సంబంధిత అధికారుల వద్ద వెంటనే సమాచారాన్ని పొంది కేసులు పరిష్కార మార్గానికి నిత్యం కృషి చేయాలని కమిషనర్ వారికి సూచించారు. అనంతరం సిపిఎం పార్టీ ఫ్లోర్ లీడర్ బొడ్డు గంగారం మాట్లాడుతూ జీవీఎంసీలో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి దీర్ఘకాల సమస్యకు కౌన్సిల్ తీర్మానం వరకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో,అధికారులతో కోర్టు కేసులపై చర్చ సమావేశం నిర్వహించడం మంచి నిర్ణయమన్నారు. జీవీఎంసీ షాపులకు సంబంధించి అద్దె రెన్యువల్ కాలం పెంచాలని, పార్కులపై ఉన్న కేసులపై దృష్టి సారించాలని, పలు కేసులు జీవీఎంసీ గెలిచినప్పటికీ ఆక్రమణదారులు వాటి ఆక్రమణలకు మరలా దౌర్జన్యం చేస్తున్నారని వాటిపై దృష్టి సారించాలని, మత్స్యదర్శిని, సుబ్బలక్ష్మి నగర్ కల్యాణ మండపం ఆస్తులను కాపాడాలని పేర్కొన్నారు. అనంతరం జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ బీసెట్టి వసంతలక్ష్మి, బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తులను పరిరక్షించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా కళ్యాణ మండపాలు, సామాజిక భవనాలు, పార్కులు, షాపుల ఆస్తుల పై ఉన్న కోర్టు కేసులను పరిష్కరించి జీవీఎంసీ ఆస్తులను కాపాడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు దొడ్డి చంద్రశేఖర్, పడాల అప్పలరాజు,నాలి శేషు కుమార్, నీలి పైడిరాజు, లగుజ భారతి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, అందరు జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు పిడి-యుసిడి సరోజినీ, కార్యదర్శి బివి రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకి, డిసిపిలు, ఏసీపీలు, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



**సామర్లకోట, మార్చి 08 (నేటి మనదేశమ్) :** స్థానిక ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన వెజ్ మార్ట్ కార్యక్రమం, విద్యార్థుల తల్లులు నిర్వహించిన టేస్ట్ ది టాలెంట్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను పాఠశాల కరస్పాండెంట్ ఎస్విబిసి.ప్రకాష్, డైరెక్టర్ సుధారాణి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు వీధి తినుబండారాలకు అలవాటు పడి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటు న్నారని అన్నారు. తినే పదార్థాలను తల్లులు తయారుచేసి వారికి ఇస్తే ఆరోగ్య సమస్యలు ఉండమన్నారు. ఇదే లక్ష్యంతో తాము ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు వెజ్ మార్కెట్ ప్రదర్శన ఆకట్టుకోగా, తల్లులు చేసిన వంటల ప్రదర్శనలో తల్లులు తమ వంటల రుచులను అందరికీ రుచి చూపిం చారు. ఈ సందర్భంగా తల్లులకు నిర్వహించిన పోటీల్లో శాఖాహార విభాగంలో జి.వీణ, మాంసాహార విభాగంలో ఎస్కె.కరీమా సుల్తానా, స్వీట్ విభాగంలో ఎన్.సాయిసత్య రాజేశ్వరి, చాట్ విభాగంలో రత్నకుమారి విజేతలుగా నిలిచారు .

# జాబ్ మేళాలో 932 మందికి ఉద్యోగాలు



**పిఠాపురం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** స్థానిక సూర్య డిగ్రీ కళాశాలలో నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నిర్వహణ సంఘం అధ్యక్షుడు హబీబ్ భాషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 932 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు 1793 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలు అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎంపి తంగేళ్ల ఉదరు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి నియామక పత్రాలను అందజేశారు. జనసేన నాయకులు మెహమ్మద్ హబీబ్ బాషా, కళాశాల కరెస్పాండెంట్ ఎండి చాంద్ భాషా, డైరెక్టర్ మహమూద్ బాషా, వాసవి క్లబ్ జోనల్ ఛైర్మన్ కెవిఆర్.మూర్తి పాల్గొన్నారు.

# రోడ్లు, కాలువల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్





**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** విశాఖ నగరంలో జరుగుతున్న రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గాజువాక జోన్ లో గంగవరం రోడ్లో, జగ్గనాయుడు జంక్షన్ లో రోడ్లు కాలువల అభివృద్ధి పనులను పర్యవేక్షక ఇంజనీర్ రాయల్ బాబుతో కలిసి పరిశీలించారు

కమిషనర్ ముందుగా గంగవరం రోడ్డులో రెండు కోట్ల రూపాయలతో మంజూరు చేసి అభివృద్ధి పరుస్తున్న రోడ్డు పనులను పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకుని పనుల ఆలస్యంపై ఆరా తీశారు. అనంతరం జగ్గు జంక్షన్లో రెండు మురుగునీటి కాలువ లను పరిశీలించిన అనంతరం జరుగుచున్న రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీరు రాయల్ బాబుకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయకు ఇంజనీర్లు, వార్డ్ ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**కాకినాడ మార్చి 08 (నేటి మనదేశమ్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒకరోజు ముందుగానే జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మార్చి 8న జరగాల్సిన మహిళా దినోత్సవం ఆదివారం రోజు రావడంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లోనూ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ శనవారం జరిగాయి. కాకినాడ స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళలు విద్యార్థులు-నేటి పరిస్థితి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా అధ్యక్షులు భూలక్ష్మి, లోవరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ గీతాంజలి మాట్లాడుతూ మహిళలు అనేక పోరాటాల ఫలితంగా నేడు మహిళా దినోత్సవ నిర్వహించుకుంటున్నామని, ఇది నేటి మహిళలకు ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి మాట్లాడుతూ నేటికీ మహిళలకు సమాన అవకాశాలు ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ నేడు చదువుల్లో, ఉద్యోగంలో మగవాళ్ళతో సమానంగా విద్యార్థినులు పోటీ పడుతున్నారని అన్నారు. మహిళలు చిన్నారిపై జరిగే దాడులకు ప్రధాన కారణమైన మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి.సత్యం, కళాశాల విద్యార్థులు మోహన్, సత్యశ్రీ, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి అపూర్వ భారత్, డిఆర్ఒ టి.తిప్పేనాయక్, కెఆర్సి ఎస్డిసి జి.రత్నమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎస్.రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. వివిధ శాఖలకు చెందిన మహిళలు పాల్గొని వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం జిల్లా ఛైర్పర్సన్ చల్లా సంధ్యారాణి, జనరల్ సెక్రటరీ పి.శిరీష, విమెన్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే అపోలో హాస్పిటల్స్లో మహిళా దినోత్సవాన్ని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ప్రారంభించారు. అపోలో మహిళా సిబ్బంది అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అడికి గణేష్, డాక్టర్ పిపి.చటర్జీ మాట్లాడారు.

# మూలిగే బాక్సాఫీస్ మీద క్రికెట్ మ్యాచ్ దెబ్బ



అసలే బాక్సాఫీస్ యమా నీరసంగా ఉంది. శ్రీవిష్ణు 'మృత్యుంజయ్'కు డీసెంట్ టాక్ ఉన్నప్పటికీ బిసి సెంటర్లలో ఆశించిన స్థాయిలో పికప్, వసూళ్లు లేవు. ఉన్నంతలో నగరాలు, పట్టణాల్లో కొంచెం మెరుగ్గా ఉంది. శివాజీ 'సాంప్రదాయినీ సుప్పిని సుద్దపూస' ఫస్ట్ షోకే ఫలితం తేలిపోగా 'మెన్షన్ హౌస్ మల్లేష్'కు సోషల్ మీడియా హడావిడి తప్ప గ్రౌండ్ లెవెల్ లో చెప్పుకునేంత సౌండ్ లేదు. వరలక్ష్మి శరత్ కుమార్ డైరెక్ట్ చేసిన ఎస్ సరస్వతికి కాసిన్ని ప్రశంసలు వినిపించాయి కానీ అవి వసూళ్లుగా మారుతున్న వైనం కనిపించడం లేదు. గత వారం వచ్చిన విష్ణు విన్యాసం వీక్ డేస్ లోనే పూర్తిగా నెమ్మదించేసింది. సరే ఈ రోజు ఆదివారం వీకెండ్ అన్ని సినిమాలకు ఏమైనా కాస్త తెరిపి దక్కి కలెక్షన్లు వస్తాయనుకుంటే క్రికెట్ రూపంలో దెబ్బ పడింది. ఐసిసి మెన్స్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఇండియా న్యూజిలాండ్ మధ్య జరగనుంది. సాయంత్రం అయిదు నుంచే హడావిడి ఉంటుంది. జనాలు బాగా ఎగ్జైట్ మెంట్ తో ఉన్నారు. చాలా చోట్ల మల్టీప్లెక్సుల్లో లైవ్ మ్యాచ్ ని ప్రదర్శించబోతున్నారు. రెగ్యులర్ టికెట్ ధరలే పెట్టడంతో టికెట్లు వేగంగా అమ్ముడుపోతున్నాయి. గత ఇరవై నాలుగు గంటల్లో 30 వేల టికెట్లు బుక్ మై షోలో అమ్మడం కొత్త రికార్డు. అంటే వర్కౌట్ కాని సినిమాలను భరించడం కన్నా ఇష్టమైన క్రికెట్ ని బిగ్ స్క్రీన్ మీద ఎంజాయ్ చేయొచ్చని ఆడియన్స్ భావిస్తున్నారు. ఆ కారణంగానే విజయవాడ లాంటి చోట్ల నాలుగైదు క్రికెట్ షోలు వేసినా వేగంగా ఫుల్స్ పడుతున్నాయి. ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాకపోవడంతో ఎగ్జిబిటర్ల కళ్లన్నీ మార్చి 19 మీద ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్, దురంధర్ ది రివెంజ్ రెండు ఒకే రోజు రానుండటంతో మళ్ళీ థియేటర్లు ప్రేక్షకులతో హౌస్ ఫుల్ బోర్డులతో నిండుగా కళకళలాడతాయని ఎదురు చూస్తున్నారు. ముందు రోజు సాయంత్రం నుంచే ప్రీమియర్లు ఉంటాయి కాబట్టి హడావిడి అప్పటి నుంచే మొదలవుతుంది. అందాక ఈ నిర్లిప్తతను తట్టుకోక తప్పదు. సంక్రాంతికి ఒకేసారి స్టార్ల సినిమాలన్నీ వచ్చేయడం, తర్వాత విశ్వక్ సేన్ లాంటి నోటబుల్ హీరోలున్న చిత్రాలు ఫ్లాప్ కావడం ఈ పరిస్థితి కారణమని చెప్పొచ్చు. ఉన్నంతలో కపుల్ ఫ్రెండ్లీ లాంటివి కొంత బండిని లాగాయి కానీ లేదంటే ఇంకా తీవ్రంగా ఉండేది.




## ప్రీమియర్ల ప్లానింగులో ఉస్తాద్ సతమతం



మార్చి 18 రాత్రి ప్రీమియర్ షోల అప్డేట్ కోసం పవన్ కళ్యాణ్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. డబ్బింగ్ కార్యక్రమాలు, పోస్ట్ ప్రొడక్షన్, రీ రికార్డింగ్ తదితర పనుల్లో బిజీగా ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ బృందం టైం చాలా తక్కువగా ఉండటంతో ప్రమోషన్లపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టలేకపోతోంది. సరే కంటెంట్ బాగుంటే పవన్ మూవీకి ఇవన్నీ అక్కర్లేదు కానీ ఇప్పుడు అందరి నుంచి ఎదురవుతున్న ప్రశ్న ఒక్కటే. ప్రీమియర్లను ఎలా ప్లాన్ చేస్తారనేది. ఆంధ్రప్రదేశ్ లో టికెట్ రేట్ల హైక్ సులభంగా వచ్చేస్తుంది. అదేమీ సమస్య కాదు. కాకపోతే ధర ఎంత పెడతారనేది అసలు చిక్కు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 600 రూపాయలు పెట్టినా ఇబ్బందయ్యేలా ఉంది. అఖండ తాండవం 2కి కొన్ని ఏరియాల్లో ఇదే సమస్యగా మారింది. ఓజి హైప్, బడ్జెట్ వేరు కాబట్టి దానికి వెయ్యి రూపాయలు పెట్టినా అభిమానులు లెక్క చేయలేదు. కానీ ఉస్తాద్ భగత్ సింగ్ అంత భీభత్సమైన బజ్ లేదు. మెల్లగా బిల్డ్ చేస్తున్నారు. కాకపోతే సమయం ఎక్కువగా లేదు. అసలే దురంధర్ ది రివెంజ్ షోలను సాయంత్రం అయిదు గంటల నుంచే స్టార్ట్ చేస్తున్నారు. పాజిటివ్ టాక్ వస్తే ఆ ప్రభావం రాత్రి నుంచే మొదలవుతుంది. దానికి ధీటుగా ఉస్తాద్ టాక్ రావాలి. వింటేజ్ పవన్ కళ్యాణ్ ని దర్శకుడు హరీష్ శంకర్ ఎలా చూపించాడనేది చాలా కీలకం కానుంది. ఇక తెలంగాణ విషయానికి వస్తే తొంభై రోజుల ముందు అనుమతి తీసుకుంటే బెనిఫిట్ షోలు, హైక్స్ కి పర్మిషన్ ఇవ్వమని కోర్టు ఇంతకు ముందే చెప్పింది. టెక్నికల్ గా ఇది పాటించడం ఉస్తాద్ భగత్ సింగ్ వల్ల కాదు. దాని బదులు అనుమతి అవసరం లేని గరిష్ట ధర 295 రూపాయలు (మల్టీప్లెక్సులు) పెట్టేస్తే మంచి ఫలితం ఉంటుందని ట్రేడ్ భావిస్తోంది. ఒకవేళ ఏపీలో జీఓ తీసుకున్నా ఒక వీకెండ్ కే పరిమితం చేయాలని, పదేసి రోజులు పెట్టడం వల్ల వసూళ్లు రావడం లేదని బయ్యర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట. వీలైనంత త్వరగా మైత్రి మూవీ మేకర్స్ క్లారిటీ ఇస్తే బెటర్. ఉగాది, రంజాన్ పండక్కు వస్తున్న స్టార్ హీరో స్ట్రెయిట్ మూవీ ఇదొక్కటే కావడంతో మరీ ఎక్కువ ఆశించకుండా డీసెంట్ ప్రైజింగ్ తో వెళ్తే ఎలా ఉంటుందనే కోణంలో అనాలసిస్ చేసుకోవాలి. ఒకపక్క దురంధర్ రివెంజ్ ప్రీమియర్ షోలు అంతకంత పెరుగుతూ పోతున్నాయి. ఉస్తాద్ కూడా ఇంకో రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తే అభిమానులు రిలాక్స్ అవుతారు. అప్పటిదాకా టెన్షనే.

## అణిగిమణిగి లేకుంటే సినిమాల్లో తీసేస్తారు



బిగ్ బాస్ షో ద్వారా మంచి పాపులారిటీ సంపాదించిన అమ్మాయి.. ఆషు రెడ్డి. ఐతే ఆ ఫేమ్ ఆమెకు పెద్దగా అవకాశాలు తెచ్చిపెట్టలేకపోయింది. ఆషు రెడ్డి నటించిన సినిమాలు తక్కువే. అందులో కూడా చిన్నా చితకా పాత్రలే చేసింది. ఐతే ఇప్పుడు ఆమెకు విక్రమ్ ఆన్ డ్యూటీ అనే సినిమాలో హీరోయిన్ తరహా పాత్ర దక్కిందట. దీని గురించి ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్లో చాలా ఎగ్జైట్ అవుతూ మాట్లాడింది ఆషు. తన సొంత తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే వీళ్లు తనకు జీవితాన్ని ఇచ్చారంటూ ఆ చిత్ర నిర్మాతలను కొనియాడింది ఆషు. ఐతే ఆ తర్వాత ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రొడక్షన్ హౌస్ చాలా స్ట్రిక్ట్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సెట్లో, అయినా ఇంట్లో అయినా అణిగి మణిగి ఉండాలని.. లేదంటే సినిమాల నుంచి తీసేస్తారని ఆమె వ్యాఖ్యానించింది. ఆర్టిస్టులు ఎవరైనా ఓవరాక్షన్ చేస్తే తీసేయడానికి వెనుకాడరని ఆమె కామెంట్ చేసింది. ఇంతలో మరో నటి అందుకుని అలాంటిదేమీ లేదని నవ్వుతూ వ్యాఖ్యానించింది. ఇక ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన కీరవాణి భలే సరదాగా మాట్లాడారు. ఏమైనా హుక్ లైన్స్ చెప్పమని అడిగితే.. పాటలకు హుక్ లైన్స్ ఉంటాయి కానీ, ఈవెంట్లకు ఉండవని ఆయనన్నారు. కానీ తనకు నచ్చని ఒక విషయం చెబుతా అంటూ బయట తనకు కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టడం.. బొకే ఇవ్వడం లాంటివి తనకు ఇష్టం ఉండవని ఆయనన్నారు. వీటి కోసం డబ్బులు వృథా చేయడం బదులు.. ఆ ఖర్చుతో ఇంట్లో ఉప్మా పెసరట్టు చేసుకుని వస్తే ఒక పట్టు పడతానని.. అవి ఒంటికి కూడా బాగా వంటపడతాయని కీరవాణి అనడంతో అక్కడ నవ్వులు పూశాయి. బిగ్ బాస్ ఫేమ్ నిఖిల్ హీరోగా నటించిన విక్రమ్ ఆన్ డ్యూటీ త్వరలో హాట్ స్టార్‌లో స్ట్రీమ్ కానుంది.

## మొన్న వార్-2.. నేడు కిమ్స్.. ఫ్యాన్స్‌పై తారక్ ఫైర్




స్టార్ హీరోల ఈవెంట్లలో అభిమానులు ఎంత హడావుడి చేస్తారో టాలీవుడ్ సినిమా ఈవెంట్లు చూసే వాళ్లకు కొత్తగా చెప్పాల్సిన పని లేదు. తమ అభిమాన హీరో హీరోయిన్లను చూసినపుడు ఉత్సాహం కట్టలు తెంచుకుని కొంత హడావుడి చేయడం వరకు ఓకే. కానీ సందర్భం చూడకుండా.. అతిథులు మాట్లాడుతున్నపుడు అదే పనిగా నినాదాలు చేయడం.. ప్రసంగాలకు అడ్డుతగలడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇదొక మేనియాలా మారి.. ఎంత ఎక్కువ హంగామా చేస్తే ఆ హీరోకు అంత ఫాలోయింగ్ ఉన్నట్లు.. ఆ ఫ్యాన్స్ అంత గ్రేట్ అన్నట్లుగా అందరు అభిమానులూ ఇలాగే తయారవుతున్న పరిస్థితి. స్టార్ హీరోలు స్వయంగా వారిస్తున్నా సరే.. ఫ్యాన్స్ ఈ విషయంలో తగ్గట్లేదు. జూనియర్ ఎన్టీఆర్ సైతం తరచుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. దీంతో ఫ్యాన్స్ మీద కోపాన్ని దాచుకోకుండా బయటపెట్టేస్తున్నాడు జూనియర్. గత ఏడాది 'వార్-2' సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్లో హృతిక్‌తో పాటు ఇతర అతిథులు మాట్లాడుతున్నపుడు ఫ్యాన్స్ పదే పదే తన పేరును ఉచ్చరిస్తూ అడ్డుతగలడంతో తారక్ ఫ్రస్టేట్ అయ్యాడు. అభిమానులకు కొంచెం గట్టిగానే వార్నింగ్ ఇచ్చాడు. తాజాగా బెంగళూరులో కిమ్స్ హాస్పిటల్ ఆరంభోత్సవం సందర్భంగానూ తారక్ ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాడు. డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతున్నపుడు.. అభిమానులు అదే పనిగా తారక్ తారక్ అంటూ నినాదాలు చేయడంతో జూనియర్‌కు కోపం వచ్చింది. దీంతో 'క్వయిట్ క్వయిట్' అంటూ చాలా సీరియస్‌గా అభిమానులకు వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అందరూ సైలెంట్ అయ్యారు. తాను ప్రతిసారీ వారిస్తున్నా అభిమానులు కంట్రోల్ కాకపోవడం తారక్‌కు బాగా కోపం తెప్పిస్తున్నట్లే ఉంది. తాజా అనుభవం తర్వాత అయినా అభిమానులు మారాల్సిన అవసరముంది. మిగతా ఫ్యాన్స్ సైతం ఈ అనవసర హంగామాకు తెరదించాల్సిన అవసరముంది.



# బిజినెస్ న్యూస్



## పడిపోయిన పసిడి ధరలు.. వారమంతా ఆనందమే!




పసిడి ప్రియులకు గడిచిన వారమంతా ఆనందమే కలిగింది. దేశంలో బంగారం ధరలు గత వారం రోజులుగా తగ్గుముఖం పట్టాయి. వరుసగా ధరలు పడిపోవడంతో పసిడి కొనే వారికి భారీ ఊరట లభించింది. గత వారంలో, అంటే మార్చి 2 నుంచి మార్చి 8 వరకు దాదాపు వారమంతా పసిడి ధరలు గణనీయంగా క్షీణించాయి. ఈ కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు కూడా ఒత్తిడికి గురయ్యాయి, దీంతో స్థానికంగా కూడా ధరలు పడిపోయాయి.

ధరలు దిగొచ్చాయిలా..

హైదరాబాద్, విశాఖ పట్నం సహా తెలుగు రాష్ట్రాలలో గత వారం బంగారం ధరలను ఒకసారి పరిశీలిస్తే.. మార్చి 2న 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,70,510 ఉండగా మార్చి 8 నాటికి రూ.1,63,640 లకు దిగొచ్చింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మార్చి 2న రూ. 1,56,300 ఉండగా మార్చి 8 నాటికి రూ.1,50,000 లకు క్షీణించింది.

అంటే వారం మొత్తంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.6,870 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.6,300 తగ్గుదలను నమోదు చేసింది.

ఈ వారంలో ధరలు రోజుకు రోజూ తగ్గుతూ వచ్చాయి. ముఖ్యంగా మార్చి 3, 4 తేదీల్లో భారీ తగ్గుదల నమోదైంది. తర్వాత కొంత ఊపిరి పీల్చుకున్నా మొత్తంగా వారం అంతా క్షీణతే కనిపించింది. మార్చి 8న మాత్రం ధరలు స్థిరంగా ఉన్నాయి.

బంగారం ధరల తగ్గుదలకు ప్రధాన కారణాలు

అంతర్జాతీయంగా బంగారం ధరలు మార్చి ప్రారంభంలో రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి (ఔన్స్‌కు సుమారు 5,400 డాలర్ల పైన). కానీ తర్వాత అమెరికా డాలర్ బలపడటం, ట్రెజరీ యీల్డ్స్ పెరగడం, మిడిల్ ఈస్ట్ ఘర్షణల నేపథ్యంలో ఇన్‌ఫ్లేషన్ భయాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాల మార్పు వల్ల సేఫ్-హెవెన్ డిమాండ్ తగ్గింది. ఇది బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చింది. అలాగే, కొన్ని రోజుల్లో ప్రాఫిట్ బుకింగ్, స్పెక్యులేటివ్ సెల్లింగ్ కూడా జరిగాయి. దీంతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు పడిపోయాయి.

## మహిళలకు ఉచిత లాకర్, ఆరోగ్య బీమా

### యెస్ బ్యాంక్ ప్రత్యేక వేతన ఖాతా

మహిళల కోసం ప్రత్యేక వేతన ఖాతాను తీసుకొచ్చినట్లు ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ఆర్థిక, జీవనశైలి అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి ప్రయోజనాలు, సంపద సృష్టి వంటి ప్రత్యేక సేవలను ఈ ఖాతా ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువస్తుందని బ్యాంక్ వెల్లడించింది. యెస్ ఎసెన్స్ ఉమెన్స్ శాలరీ అకౌంట్‌లో తొలి సంవత్సరం ఉచిత లాకర్ సౌకర్యం, ఏడాది పాటు రూ.5 లక్షల కాంప్లిమెంటరీ హెల్త్ కవర్, ఏడాదికి ఒకసారి ఉచిత ఆరోగ్య పరీక్షలు వంటి ఫీచర్లు ఉన్నాయి. వీటితో పాటు ఖాతాదారులు కాంప్లిమెంటరీ ఎలిగెన్స్ డెబిట్ కార్డు పొందొచ్చు. దీని ద్వారా ఎంపిక చేసిన విభాగాల్లో 5 శాతం క్యాష్‌బ్యాక్ (ఏటా రూ.6,000 వరకు) పొందొచ్చు.

ఎస్‌బీఐ రూ.4,590 కోట్ల రుణాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4,590 కోట్లు) సామాజిక రుణ సౌకర్యాన్ని తీసుకొచ్చింది. లింగ వివక్షను తగ్గించేందుకు, ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యం సాధించేందుకు ఇది దోహదం చేస్తుంది. పర్యావరణం, సామాజిక, పాలన సూత్రాలపై బ్యాంకుకు ఉన్న నిబద్ధతకు, స్థిరమైన అభివృద్ధికి నిదర్శనంగా ఇది నిలుస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జెండర్-థీమ్ రుణంగా పేర్కొంటున్న ఈ పథకం.. ఆర్థిక వృద్ధితో పాటు, సామాజిక మార్పును తీసుకొచ్చేందుకు ఉద్దేశించింది.



పత్యేక గృహ రుణం 'స్ఫూర్తి': మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఎల్ అండ్ టీ ఫైనాన్స్ 'స్ఫూర్తి' పేరుతో ప్రత్యేక గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. గృహ రుణాలపై గరిష్ఠంగా 25 ఏళ్లు, పారిశ్రామిక ఆస్తుల హామీతో 12 ఏళ్ల వరకూ కాల వ్యవధితో రుణాలు ఇస్తున్నట్లు తెలిపింది. వ్యాపారంలో కనీసం 50 శాతం వాటా ఉండి, రూ.5 లక్షల వార్షిక లాభం పొందే మహిళలు దీనికి అర్హులు. తక్కువ వడ్డీ రేట్లు, సడలించిన నిబంధనలతో రూ.75 లక్షల వరకూ రుణాలు పొందవచ్చు.

## పాత వాహనాలపై డబుల్ ట్యాక్స్!




మహారాష్ట్ర ప్రభుత్వం పాత వాహనాలను రద్దు చేసి.. కొత్తవి కొనుగోలు చేసే వాహనదారులకు పన్ను ప్రోత్సాహకాలను ప్రతిపాదించింది. ఈ సమయంలో.. కొన్ని పాత ప్రైవేట్ వాహనాలపై పర్యావరణ పన్నును పెంచాలని కూడా యోచిస్తోంది. 2026--27 రాష్ట్ర బడ్జెట్ సమయంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. రోడ్డుపై పాత లేదా కాలుష్య కారక వాహనాల సంఖ్యను తగ్గించడం ఉ రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యతను మెరుగుపరచడం ఈ చర్యల లక్ష్యం అని అన్నారు. కొత్త ప్రతిపాదన ప్రకారం.. ఇప్పటికే ఉన్న వాహనాన్ని స్క్రాప్ చేసి, కొత్త వాహనాన్ని కొనుగోలు చేసే కొనుగోలుదారులకు మోటారు వాహన పన్నులో రాయితీ లభిస్తుంది. దీూ-4 లేదా కొత్త ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వాహనాలను స్క్రాప్ చేసేవారికి 16 శాతం పన్ను రాయితీ లభిస్తుంది. దీూ-3 లేదా పాత ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలను స్క్రాప్ చేసి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసేవారికి 30 శాతం అధిక రాయితీ లభిస్తుంది.

బీఎస్-4 ఉ అంతకు ముందు ఉద్గార ప్రమాణాలు కలిగిన నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని ఫడ్నవీస్ అన్నారు. దీనిని పరిష్కరించడానికి.. పన్నును రెట్టింపు చేయాలని ప్రతిపాదించడం జరిగిందని పేర్కొన్నారు.

## సమ్మర్‌లో ఏసీ షాక్.. ధరలు పెంచేస్తున్న కంపెనీలు

ఈ వేసవికి ఏసీ కొనాలనుకుంటున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్. ముడి పదార్థాల ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఏసీ తయారీ కంపెనీలు ధరలు పెంపునకు సిద్ధమవుతున్నాయి. రవాణా ఖర్చులు, కొత్త ఇంధన వినియోగ నిబంధనలు కూడా పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలు పెంచగా.. మరికొన్ని పెంపునకు సిద్ధమవుతున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హైయర్, మిత్సుబిషి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ప్రముఖ ఏసీల తయారీ కంపెనీ డైకిన్ తన ఏసీ ధరలను 12 శాతం వరకు పెంచనుంది. మోడల్‌ను బట్టి ఏప్రిల్ నుంచి ఈ పెంపు ఉండబోతోందని డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా పేర్కొన్నారు. ఏసీల తయారీలో వినియోగించే రాగి వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో పాటు, కొత్త ఇంధన నిబంధనల వల్ల ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల వల్ల సరకు రవాణా ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయం లేక ఏసీ ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి ఏసీ కంపెనీదీ ఇదే పరిస్థితి అని వివరించారు. ఈ ఏడాది ఏసీల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు.

బ్లూస్టార్ ఇది వరకే: మరో ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఫిబ్రవరి మధ్యలోనే ఏసీ ధరలను 8-10 శాతం పెంచేసింది. అయితే పాత ధరల ఇన్వెంటరీ ఇప్పటికీ మార్కెట్లో ఉన్నందువల్ల రేటులో పెద్దగా తేడా ఉండబోదని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. ఏసీల ధరల పెరుగుదల ఊహించి డీలర్లు ముందుగానే స్టాక్ పెట్టుకుని, వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్‌పై మాత్రం ధరల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ సైతం 5-15 శాతం మేర ఏసీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. గడిచిన కొన్ని నెలలుగా రాగి ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం అవ్వడం వంటి కారణాలతో రేట్లు పెంచాల్సి వస్తోందని వోల్టాస్ ఎండీ ముకందన్ మేనన్ పేర్కొన్నారు. దీంతో పాటు ఎల్‌జీ సంస్థ 3 స్టార్ ఏసీలపై 7 శాతం, 5 స్టార్ మోడళ్లపై 9-10 శాతం చొప్పున ధరల పెంచుతున్నట్లు వెల్లడించింది. హైయర్ ఇండియా సైతం 5-8 శాతం మధ్య ధరలు పెంచబోతోందని ఆ కంపెనీ



ప్రెసిడెంట్ సతీష్ పేర్కొన్నారు. మిత్సుబిషి ఏసీ ధరలు 5 శాతం మేర పెరగనున్నాయని ఆ కంపెనీ పేర్కొంది.

2026పైనే ఆశలు: ఏసీ తయారీ కంపెనీలన్నీ దాదాపు ఈ ఏడాది విక్రయాలపై పెద్దగానే ఆశలు పెట్టుకున్నాయి. గతేడాది వీటి విక్రయాలు మందగించడమే ఇందుకు కారణం. అకాల వర్షాలు, ఇతర అంశాలు వీటి విక్రయాలపై ప్రభావం చూపాయి. 2024లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, ఉక్కపోత కారణంగా రికార్డు స్థాయిలో ఏసీల విక్రయాలు నమోదయ్యాయి. మళ్లీ ఆ స్థాయిలో విక్రయాలను ఈ ఏడాది ఉంటాయని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

# అనుమతులు లేని అక్రమ నిర్మాణం

- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు
- పత్రికా ప్రతినిధులు పంచాయతీ అధికారులను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని సన్నాయి నొక్కులు


శానిటరీ సూపర్‌వైజర్ ప్రసాద్



**కొత్తవలస, మార్చి 08, నేటి మనదేశం ప్రతినిధి :** కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి కుతవేటు దూరంలో అక్రమ నిర్మాణం జరుగుతున్న గ్రామపంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి వివరాల్లోకి వెళితే కొత్తవలస విజయనగరం ప్రధాన రహదారికి అనుకుని ఉన్న పీఎంఎల్ కాంప్లెక్స్ వెనుక భాగంలో 32 గజాల స్థలంలో సుమారు నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టారు సదరు నిర్మాణ స్థలానికి ఎల్ పి సి ప్లాన్ అప్రూవల్ ఏమీ లేకపోయినా దర్జాగా నిర్మాణం చేపడుతున్న గ్రామపంచాయతీ అధికారులు ఆ నిర్మాణం పై చర్యలు తీసుకోకపోవడంతో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి ఈ నిర్మాణం పై మీడియా ప్రతినిధులు గ్రామపంచాయతీ అధికారులను కలిసి వివరాలు అడగగా సదరు నిర్మాణానికి ఎటువంటి అనుమతులు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఇవ్వలేదని నిర్మాణ స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు డి ఎల్ పి ఓ. డి.శిరీష రాణి, వివరణ :- ఏవైనా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు అయితే చర్యలు తీసుకుంటామని నిర్మాణ దారుడు ప్రతికటించినట్లు అయితే కేసులు బనాయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు,

**శానిటరీ సూపర్వైజర్ ప్రసాద్ వివరణ :-** ఇంటి యాజమానికి పలుమార్లు ఇంటి యొక్క ప్లాన్ అప్రూవల్ లేకుండా ఇంటిని నిర్మించడం చట్ట రీత్యా నేరమణి వెంటనే పంచాయతీ కార్యాలయానికి వచ్చి కలవాలని తెలిపేము అని కానీ ఇంటి యజమాని మేము చెప్పిన మాటలు విస్మరించి నిర్మాణం చేపడుతున్నడు అయన పై చర్యలు తీసుకుంటాము అని తెలిపారు.

# గీతం వర్సిటీ "భూ బరితెగింపు"

- భూ బదలాయింపుపై కోర్టులో కేసులున్నా లెక్క చేయని చంద్రబాబు, విశాఖ ఎంపీ
- వైయస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపాటు

విశాఖలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

- రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం యూనివర్సిటీకి అడ్డదారిలో క్రమబద్ధీకరించారు
- జీవో రాకముందే భూముల్లో లెవలింగ్ పనులు చేస్తున్నారు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అండతో విశాఖ ఎంపీ భూ దురాక్రమణ
- వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ గారి ఆదేశాలతో భూ దోపిడీపై ప్రజా, న్యాయ పోరాటానికి సిద్ధం
- తేల్చిచెప్పిన కేకే రాజు




**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన బంధువులు, బినామీలకు ప్రభుత్వ భూములను పప్పు బెల్లాలకు కట్టబెడుతున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని చంద్రబాబు, విశాఖ ఎంపీ భరత్ ల్యాండ్ గ్రాబింగ్ ఏవిధంగా చేస్తున్నారనే దానికి నిదర్శనమే గీతం యూనివర్సిటీలో జరుగుతున్న భూ దురాక్రమణ అన్నారు. ఇవి ప్రభుత్వ భూములు, ఆక్రమణ దారులు శిక్షార్హులు అని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి గీతం యూనివర్సిటీ యాజమాన్యం చదును చేసే కార్యక్రమాలు వారి బరితెగింపునకు పరాకాష్ట అన్నారు. విశాఖలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన గీతం యూనివర్సిటీ యాజమాన్యం వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కేకే రాజు ధ్వజమెత్తారు.

**అధికారికంగా జీవో జారీ చేయకముందే.. :** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఎలాంటి చర్చ లేకుండానే రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం యూనివర్సిటీకి క్రమబద్ధీకరించేలా తీర్మానం ఆమోదించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అండతో జీవీఎంసీలో దౌర్జన్యం జరిగింది, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. ఇంకా ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేయకముందే గీతం యాజమాన్యం భూమిని తమ ఆధీనంలోకి తీసుకుని చదును చేసే పనులు ప్రారంభించింది. గతంలో ప్రభుత్వం పెట్టిన 'ఇది ప్రభుత్వ భూమి..ఆక్రమణదారులు శిక్షార్హులు' అనే బోర్డులను కూడా తొలగించి లెవలింగ్ పనులు చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా పనులు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం స్పందించడం లేదు.

**బోర్డులను పీకేసి మరి.. :** గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖ జిల్లాలో జరిగిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకుని సుమారు 2 వేల ఎకరాల భూమిని సంరక్షించింది. ఇందులో భాగంగా గీతం ఆక్రమించిన 40 ఎకరాలకు పైగా భూమిని అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో నిర్మాణాలను కూడా తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంకా 14 ఎకరాలకు పైగా భూమిపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది, తుది తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అయినప్పటికీ అధికారుల అండతో గీతం యాజమాన్యం మళ్లీ పనులు ప్రారంభించింది. బోర్డులు పీకేసి భూమి చదును చేసే పనులు చేపడుతున్నారు.

**కార్పొరేట్ సంస్థలకు పప్పు బెల్లాలకు భూములు**

విశాఖ అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను చౌకగా కట్టబెడుతోంది. రెండు మూడు నెలల క్రితం ఏర్పాటైన కంపెనీలకే కోట్ల విలువైన భూములను కేటా యిస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారులు చేసుకునే బడ్డీ కొట్లను మాత్రం బుల్డోజర్లతో కూలదోసి వారి పొట్ట గొడుతున్నారు.

జీవీఎంసీ కమిషనర్ టీడీపీ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఊరుపేరు లేని కంపెనీలకు వేలాది రూపాయల విలువ చేసే భూములను చౌకగా కట్టబెడుతున్నారు. విశాఖ నడిబొడ్డున రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బస్టాఫ్‌లో సగ భాగాన్ని నెలకు రూ.10 వేల చొప్పున అధికార పార్టీ నాయకుడికి కేటాయించారు. జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు చంద్రబాబు చెప్పుచేతుల్లో ఇష్టారాజ్యాంగా భూములు కట్టబెడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడితే, చట్టానికి విరుద్ధంగా చేసిన భూ కేటాయింపులపై న్యాయపరంగా శిక్ష పడుతుంది. బోర్డులు తొలగించిన గీతం యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేస్తున్నాం. గీతం భూముల వ్యవహారం పూర్తిగా చట్ట విరుద్ధం, ఈ అంశంపై న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ప్రజా పోరాటానికి సిద్ధమవుతున్నామని కేకే రాజు స్పష్టం చేశారు.

# ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి




**విజయనగరం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఆప్కోస్‌లో ఉద్యోగి అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. పైసా ఇవ్వకుండా 60 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేస్తున్నారని చెప్పారు. ఆప్కోస్‌లో ఉద్యోగిగా నమోదు కావడంతో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు కూడా రావడం లేదన్నారు. కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో నిరాదరణకు గురై చిత్తు కాగితాలు ఏరుకోవలసిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా మున్సిపల్ కార్మికులకు చెప్పులు, నూనెలు, డబ్బులు, షూ వంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని చెప్పారు. పుస్కొట్లు, దంపర్ బిన్నులు, చీపుర్లు, కాలువ పారలు కొరత తీవ్రంగా ఉందన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం



**విజయనగరం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** జిల్లాలో కొన సాగుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్వే లైన్లు, జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శని వారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీ క్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించిన కలెక్టర్... నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే 2712.51 ఎకరాల సేకరణ పూర్తయిందని, ఇతర పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తోటపల్లి, తారకరామ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపై సమీక్షించారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు విషయంలో మిగిలి ఉన్న 204.53 ఎకరాల భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సాగునీటి పనులకు ఎటువంటి ఆటంకమూ కలగకూడదని స్పష్టం చేశారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతి, జిల్లాలో మంజూరైన 17 రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల స్థితిగతులపై సమీక్షించారు. మున్సిపాల్టీల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం కోసం ప్రతిపాదించిన ఎస్‌టిపిలకు, పరిశ్రమల విస్తరణకు, కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలు, హోటళ్లు, బాడంగి నావెల్ డిపో, రెల్లి గ్రేహౌండ్స్, పతంజలి, ఫుడ్ పార్కులు, ఐటి పార్కులు, ప్రతిపాదిత గుర్ల స్టీల్ ప్లాంట్, ఎంఎస్‌ఎంఇ పార్కులు తదితర వాటికి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డిఆర్‌ఒ సిహెచ్ సత్తిబాబు, ఎస్‌డిసిలు కళావతి, శ్రీరాములనాయుడు, ఆర్‌డిఒలు వెంకటేశ్వరరావు, సుధారాణి, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

# కంబాలకొండలో కాటేజీలు

## ఒక్కో కాటేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు అవుతుందని అంచనా




**విశాఖపట్నం మార్చి 08 (నేటి మనదేశమ్) :** రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో గల కంబాలకొండలో పర్యాటకులు రాత్రిపూట బస చేయడానికి వీలుగా కాటేజీలు నిర్మించాలని అటవీ శాఖ నిర్ణయించింది. దేశంలో అటవీ ప్రాంతాలను సందర్శించేవారి సంఖ్య ఏటేటా పెరుగుతుంది. కొందరు అక్కడే రాత్రిపూట బస చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కర్ణాటకలో జంగిల్ రిసార్ట్స్, లాడ్జిలకు మంచి ఆదరణ లభిస్తోంది. అందుకోసం ఆ రాష్ట్రం ప్రత్యేకించి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. ఇదే బాటలో పలు రాష్ట్రాలు అటవీ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో పర్యాటకుల కోసం అడవుల్లో ప్రత్యేకించి సదుపాయాలు కల్పించాలని అటవీ శాఖకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. దీంతో కంబాల కొండలో రాత్రి పూట పర్యాటకులు గడిపేందుకు అనువుగా నాలుగైదు కాటేజీలు నిర్మించాలని ప్రతిపాదించారు.నగరానికి ఆనుకుని విస్తరించిన సుమారు 15 వేల ఎకరాల రిజర్వు ఫారెస్టులో కంబాలకొండ ఎకో టూరిజం పార్కు ఉంది. రిజర్వు ఫారెస్టులో ఒకప్పుడు పలు రకాల జంతువులు ఉండేవి. చిరుతపులులు కూడా సంచరించేవి. అయితే నగరీకరణ పెరగడంతో చిరుతలు దాదాపు అంతరించిపోయాయి. జింకలు మాత్రం వందల సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం కంబాల కొండకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ మాత్రమే సందర్శకులను అనుమతిస్తున్నారు. ఇటీవల సుమారు రూ.1.5 కోట్లతో గెస్ట్ హౌస్, యాంపీ థియేటర్, యోగా, మెడిటేషన్ హాలు, వ్యూ పాయింట్ నిర్మించారు. చెరువులో బోటింగ్ సదుపాయం కల్పించారు. ఇకపై రాత్రి బస చేసేలా గెస్ట్ హౌస్‌కు అదనంగా నాలుగైదు కాటేజీలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, రక్షణ ఏర్పాట్లు, రెస్టారెంట్ సౌకర్యం వంటివి ఉంటాయి. ఒక్కొక్క కాటేజీకి రూ.15 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన తరువాత ఒక అంచనాకు రావచ్చునని అధికారులు వివరించారు.

# ఇథైలిన్ గ్లైకాల్ కలవడంతోనే మరణాలు

- పాల కల్తీ ఘటనలో ల్యాబ్ రిపోర్టుల వెల్లడి
- పాల వ్యాపారిపై తొమ్మిది కేసులు నమోదు : ఎస్పి



**రాజమహేంద్రవరం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** విష పూరితమైన ఇథైలిన్ గ్లైకాల్ కలవడంతోనే కల్తీ పాలు సేవించిన బాధితులు మృతి చెందారని ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ (ఎఫ్ఎస్ఎల్), ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ (ఆర్ఎఫ్ఎస్ఎల్) రిపోర్టులలో వెల్లడైనట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పి నరసింహ కిషోర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎల్, ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌ల నుంచి వచ్చిన ఐదు రిపోర్టులు, ఫోరెన్సిక్ ఫైనల్ ఓపెనియన్ ఆధారంగా చనిపోయిన బాధితులు విషపూరితమైన ఇథైలిన్ గ్లైకాల్ కలిసిన పాలు సేవించడం వల్ల కిడ్నీ ఫెయిల్యూర్ అయినట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. కల్తీ పాలు సరఫరా చేసి 11 మంది మరణాలకు కారణమైన పాల వ్యాపారి అడ్డాల గణేశ్వరరావుపై తొమ్మిది కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ల్యాబ్ రిపోర్టులో పేర్కొన్న అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విచారణలో భాగంగా బాధితుల రక్త నమూనాలు, బాధితులకు సరఫరా చేసిన కల్తీ పాలు, పెరుగు, నరసాపురంలోని పాల వ్యాపారి నడుపుతున్న 'వరలక్ష్మి పాల కేంద్రం'లోని ఫ్రీజర్, అక్కడి పదార్థాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఆ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పి పేర్కొన్నారు. కల్తీ పాల ఘటనలో రాజమహేంద్రవరం నగరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో ఇప్పటి వరకు 11 మంది మృతి చెందిన విషయం విదితమే.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి



**ఆసిఫాబాద్,మార్చి 08 (నేటి మనదేశమ్) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ కె హరిత అన్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, రహదారి, భవనాల శాఖ ఇంజనీరింగ్, నేషనల్ హైవే రవాణా, విద్యుత్ శాఖ, వైద్య, విద్య శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరుచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వాహన దారుడు సీటు బెల్టు, ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో వాహనాల రద్దీ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారని వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటిని తొలగించాలన్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో సర్కిల్ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి ప్రమాదాలు జరుగకుండా సంబంధింత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలి

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా చేసిన వారిపై కఠినంగా వ్యవరిం చా లని కలెక్టర్ కె హరిత అన్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీఓ లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, మ త్తు పదార్థాలను రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి సాగు జరగకుండా రెవెన్యూ, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు గంజాయి మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

# అట్టహాసంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




- ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉత్తమ ప్రతిభ చూపిన 59 మంది మహిళా అధికారులకు, సిబ్బందికి అవార్డులు అందజేత






**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, మార్చి 08 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, మహిళల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీసీసీ ఎండీ శోభిక పాల్గొని సందేశాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారత ఒక్కరోజుతో ముగిసే కార్యక్రమం కాదని, సమాజం మొత్తం దీనిని అర్థం చేసుకుని మహిళలకు మరింత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి నిర్ణయాలతో మహిళలకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా అదే దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని, "తల్లికి వందనం", "స్త్రీ శక్తి" వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆనందపురం మండలం గిడిజాల వద్ద మహిళల కోసం 50 ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి (రాజ్జు) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా ఇప్పటివరకు సుమారు 50 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని చెప్పారు. విశాఖపట్నంలో భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రానున్న నాలుగేళ్లలో నగరం మరింత అభివృద్ధి సాధించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారత నిజమవుతున్న సమయం ఇదని అన్నారు. కార్యక్రమానికి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబంగా కనిపించాయన్నారు. మహిళల శక్తి అపారమని, ప్రతి రంగంలో కనీసం 50 శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. చదువు, ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. ప్రభుత్వం "బాల సంజీవని", "బేటీ బచావో.. భేటీ పడావో", "స్త్రీ శక్తి", "తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున సహాయం అందిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా దాదాపు 40 లక్షలకుపైగా మహిళలకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. అలాగే పీఎంఈజీపీ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అంధ మహిళా క్రికెట్ క్రీడాకారిణి పి. కరుణ కుమారిని అతిథులంతా ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీసీసీ ఎండీ శోభికలకు సత్కారం చేసి జ్ఞాపికలు అందజేశారు. ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ, జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ప్రవీణ, జూ క్యూరేటర్ మంగమ్మ, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి తదితర అధికారులతో పాటు ఆయా రంగాల్లో ప్రతిభ చూపిన 59 మంది మహిళా అధికారులకు, సిబ్బందికి అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. పీడీ లక్ష్మీపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత తదితరులు పాల్గొన్నారు.

**స్టాళ్ల సందర్శన... పథకాల ప్రయోజనాలు అందజేత**

ముందుగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు, లతా మాధురి స్టాళ్లను సందర్శించి మహిళలు తయారు చేసిన వివిధ వస్తు ఉత్పత్తులను పరిశీలించారు.

ఈ సందర్భంగా పలు లబ్ధిదారులకు ఆస్తులకు సంబంధించిన పత్రాలను కూడా అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.3 లక్షల విలువగల ఆటోలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

## వేసవిలో పశుపక్ష్యాదులకు తాగునీటిని ఏర్పాటు చేద్దాం

- ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి.
- చెత్త ను ఆదాయవంతంగా విభజిద్దాం.
- శివాజీ పార్క్ లో హ్యాపీ సండే, అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో కోరిన జివిఎంసి అదనపు కమిషనర్, పి.నల్లనయ్య.







**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** విశాఖ నగరంలో పశు పక్ష్యాదులు ఎక్కువగా వేసవికి గురవుతాయని వాటికి దాహాన్ని తీర్చేందుకు మీ సమీప పార్కులలో, ప్రతి ఇంటి ఆవరణలో పశుపక్ష్యాదులకు నీటిని ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతూ జివిఎంసి అడిషనల్ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. ఆది వారం ఆయన శివాజీ పాలెం లోని శివాజీ పార్క్ లో హ్యాపీ సండే, ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం లతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ నల్లనయ్య అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా అందరికీ అభినందనలను తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పిచ్చుకల కోసం గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో నేతృ త్వంలో ధాన్యం కంకులు కుచ్చులు చెట్ల కు పురు కూసతో కట్టి వేలాడే తీయడం, నీటి పాత్రలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే వేసవిలో పశుపక్షాదులు దాహానికి గురవుతాయని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పశుపక్ష్యాదులకు నీరు అందు బాటులో ఉంచాలి అని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద నుంచి వచ్చే చెత్త ను నాలుగు డస్ట్ బిన్నులలో విభజించి వెయ్యా లని కోరుతూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రధానంగా వంట ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలు ఎరువుగా తయారు చేసి ఇంటి మేడ మీద కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం ద్వారా అందరూ ఆరోగ్యవంతంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ శివప్రసాద్, సహాయక వైద్యాధికారి బి.ప్రసాద్ రావు, జీవీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ఆర్ పి లు, ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ సంస్థ ప్రతినిధి ఒ కృష్ణ కుమారి, వనమాలి సిటిజి గ్రూపుల ప్రతినిధి అంబిక, డాక్టర్ అనుపమ, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం పురస్కరించుకొని
## ప్రత్యేక ఆఫర్ ప్రవేశపెట్టిన ఒమేగా హాస్పటిల్




**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, మార్చి 08 :** మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో చేసిన కృషి మరువలేనిదని ఒమేగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవిశంకర్ అన్నారు. ఒమేగా హాస్పటల్, విశాఖపట్నంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాస్పటల్ మేనేజింగ్ డైరక్టర్ డా. బి. రవిశంకర్, ప్రముఖ సంఘసేవకురాలు శేషుమాంబ, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. నీలిమ, హాస్పటల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ శుభాకర రావులు అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. రవిశంకర్ మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు ఈ సమాజంలో కల్పించడానికి, వారిలో అవగాహన పెంచడానికి ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎంతో ముఖ్యమని, మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలని ఆకాంక్షించారు. శేషుమాంబ మాట్లాడుతూ సమాజంలో స్త్రీల పైన ఇప్పటికీ అనేక అఘాయత్యాలు జరుగుతున్నాయని, మహిళలు వాటిని ధైర్యంగా ఎదుర్కొని పోరాడి ఎదురు నిలబడాలని పేర్కొన్నారు. ప్రతి మహిళా తన కుటుంబ సభ్యుల బాధ్యతలను నిర్వహిస్తూ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అవసరమైనవారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తానని తెలిపారు. మహిళలు యోగా లాంటివి నేర్చుకోవాలని హితవు పలికారు. ముఖ్య అతిథి డాక్టర్ నీలిమ మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుందని, తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదన్నారు. ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రలు పోషించడం గొప్ప విషయంగా చెప్పారు. మగవారికి సమానంగా బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుందన్నారు. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయనీ, వీటన్నింటికి ప్రతీకగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, మహిళలకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అవసరమని వీటికోసం సమయం కేటాయించాలని తెలిపారు. హాస్పటల్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ శుభాకరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని తెలియజేశారు. మహిళలు అనేక రంగాల్లో ప్రతిభ చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సమాజ అభివృద్ధికి, కుటుంబ బాంధవ్యాలకు మహిళలు అధిక ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. ఒక వైపు ఉద్యోగం చేస్తూ, తన బాధ్యతను నిర్వ హిస్తూ, మరొకవైపు మహిళగా, తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలందరికీ ఉమెన్స్ డే శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో మరణించిన వీర సైనికుల కుటుంబాల మహిళలను, వారు చేసిన త్యాగాలను గుర్తించి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉమెన్స్ డే సందర్భంగా స్త్రీలకు కానుకగా ఒమేగా హాస్పిటల్ లో ఒక ప్రత్యేక హెల్త్ చెక్ పాకేజ్ ని ప్రకటించారు. రూ. 7000 ల వరకు విలువచేసే టెస్టులను కేవలం రూ. 999 లకు అందించడం జరుగుతుందని తెలియచేసారు. ఈ అవకాశం విశాఖపట్టణం, పరిసరప్రాంత ప్రజలు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒమేగా హాస్పిటల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం .

- పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్ లలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ
- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు - జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్





**విశాఖపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ాబఎశ్రీఅఏ +తీఅవఋఅఎవ =వఞతీవంయిశ్రీ ంఎర్‌వఎా+=ా )కార్యక్రమం" 2026 మార్చి 09 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 మార్చి 09 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు. గమనిక: 1) జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52 వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనది. 2) నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్ . టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనది. 3) అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు , వినాయక టెంపుల్ సమీపములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడమైనది. కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధాస్థానంలో ఉన్నవని తెలియపరచడమైనది.




**భీమునిపట్నం, మార్చి 08 (నేటి మనదేశమ్) :** భీమిలి మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రెవెన్యూ మరియు పోలీస్ డిపార్ట్మెంట్ల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమునిపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ డి. సౌజన్య, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి .స్వాతి భవాని , భీమిలి కె. సంగీత్ మాధుర్ ,విశాఖ ఉత్తర మండలం పోలీస్ సబ్ డివిజన్ ఎ.సి.పి.ఎస్ .అప్పలరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com